# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979




తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 272 ఆదివారం 28 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## రిజర్వేషన్లు ఎత్తేసేందుకు
# బీజేపీ కుట్ర



- లోక్‌సభ ఎన్నికల్లో ఏదో విధంగా లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నం చేస్తోంది
- కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ జనాభాను లెక్కించి రిజర్వేషన్ కల్పిస్తాం
- "మోదీ, అమిత్ షా అన్ని వ్యవస్థలను వాడుకుంటున్నారు
- దేశ జనాభా ఆధారంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు నిర్ణయించింది
- ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు రిజర్వేషన్లను వ్యతిరేకించాయి.
- 400 స్థానాల్లో గెలిస్తే రిజర్వేషన్లు రద్దు చేయవచ్చుననేది బీజేపీ కుట్ర
- దేశాన్ని రిజర్వేషన్ రహిత హిందూ దేశంగా మార్చాలనేది బీజేపీ కుట్ర
- రిజర్వేషన్ రద్దుపై కిషన్ రెడ్డి, ఈటల, కేసీఆర్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్న

హైదరాబాద్

బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఏదో విధంగా లబ్ధిపొందాలని బీజేపీ ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీ జనాభాను లెక్కించి రిజర్వేషన్ కల్పిస్తామని రేవంత్ వెల్లడించారు. "మోదీ, అమిత్ షా అన్ని వ్యవస్థలను వాడుకుంటున్నారు. దేశ జనాభా ఆధారంగా కాంగ్రెస్ రిజర్వేషన్లు నిర్ణయించింది. ఆర్ఎస్ఎస్ అనుకూల వర్గాలు రిజర్వేషన్లను వ్యతిరేకించాయి. రిజర్వేషన్లు ఎత్తేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాహుల్ గాంధీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. భారత్‌ను పూర్తి హిందూ దేశంగా మార్చబోతున్నారు. రాజ్యాంగాన్ని సైతం మార్చబోతున్నారు" అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. 400 లోక్ సభ స్థానాల్లో గెలిస్తే ఎవరి అవసరం లేకుండా రిజర్వేషన్లను రద్దు చేయవచ్చుననేది బీజేపీ కుట్ర అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే బీసీ జనాభాను లెక్కించి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు సరైన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. 2025తో ఆరెస్సెస్‌ను స్థాపించి వందేళ్లవుతుందన్నారు. ఈలోగా భారత్‌ను రిజర్వేషన్ రహిత... హిందూ దేశంగా మార్చాలని ఆరెస్సెస్ ఎప్పుడో చెప్పిందన్నారు. ఇందుకోసమే బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. బలహీనవర్గాలపై మోదీ, అమిత్ షా సర్జికల్ స్ట్రైక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. అరెస్సెస్ -మిగతా3లో

## లోక్‌సభ తర్వాత స్థానిక సమరం




- జూన్ నెలలో స్థానిక సంస్థల ఎన్నికలు
- ఈ ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ బాక్సులతో నిర్వహించాలని ఈసీ నిర్ణయం
- బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన సీళ్లు, చిరునామా ట్యాగ్‌లను మే 15లోగా ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఎస్ఈసీ ఆదేశం
- రాష్ట్రంలో గత ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసిన సర్పంచుల పదవీకాలం
- మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పదవీకాలం జూలై 3వ తేదీతో ముగింపు



## కాంగ్రెస్‌ను దేశ ప్రజలే నమ్మే పరిస్థితిలో లేరు

- "దేశాన్ని అభివృద్ధి చేసే అభ్యర్థి కాంగ్రెస్‌లో ఉన్నారా
- కాంగ్రెస్‌ను దేశం నమ్మడం లేదు
- కనీసం పీఎం అభ్యర్థి ఎవరో కూడా తెలియదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం
- ఇండియన్ పొలిటికల్ లీగ్‌లో మా కెప్టెన్ మోదీ..
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను పాతాళంలో పాతిపెట్టడం ఖాయం.

కరీంనగర్

కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలే నమ్మే పరిస్థితిలో లేరని కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. సంజయ్ శనివారం ఉదయాన్నే కరీంనగర్ లోని ఓ కాలేజీ గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్ కి వెళ్లారు. ఈ సందర్భంగా మీడియా -మిగతా3లో

# తెలంగాణలో చిత్రవిచిత్రాలు



- నేను భోజనం చేస్తుంటే రెండుసార్లు కరెంట్ పోయింది..
- తెలంగాణ రాష్ట్రంలో చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయన్న కేసీఆర్
- గంట క్రితం శ్రీనివాస్ గౌడ్ నివాసంలో భోజనం చేస్తుండగా కరెంట్ పోయిందని వెల్లడి
- కరెంట్ పోవడం లేదని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఊదరగొడుతున్నారని విమర్శ

హైదరాబాద్

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ ప్రెసిడెంట్ కేసీఆర్ ఎక్స్ ఖాతాను తెరిచిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహబూబ్ నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో తాను భోజనం చేస్తుండగా రెండుసార్లు కరెంట్ పోయిందని పేర్కొన్నారు. ఎక్స్‌లో చేరిన తర్వాత ఆయన వరుసగా మూడు ట్వీట్లు పెట్టారు. తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయంటూ ట్వీట్ చేశారు మాజీ సీఎం కేసీఆర్. "నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది. -మిగతా3లో



## అబద్ధాలు చెప్పడంలో తనకు..తానే దిట్ట

- నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారు
- మోదీపై సిద్దరామయ్య విమర్శలు
- అసంబద్ధమైన మాటలు మాట్లాడి ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం, వారి గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నిస్తున్నారు
- లోక్‌సభ ఎన్నికల్లోనూ తాము ఇచ్చిన ఎన్నికల హామీలే తమని గెలిపిస్తాయి

# పెరిగిన బస్సు టికెట్ ధర

- రూ. 720 టికెట్ 3000కు..
- ఓటేయడానికి ఆంధ్రాకు వెళ్లాలంటే కష్టమే
- బస్సులు.. రైళ్లు హౌస్‌ఫుల్
- ఊరికి వెళ్లాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు

హైదరాబాద్

సొంత ఊరిలో ఓటు హక్కు వినియోగించుకోవాలని అనుకున్న వారు తమ ఊరికి వెళ్లాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. రైళ్లు, బస్సులు ఇప్పటికే ఫుల్ అయ్యాయి. ప్రైవేటు బస్సుల్లో టికెట్ల ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. రాజకీయ పార్టీల నాయకులు తగిన ఏర్పాట్లు చేస్తే తప్ప.. ఊరెళ్లే మార్గం లేదని పలువురు పేర్కొంటున్నారు. స్కూళ్లకు వేసవి సెలవులు రావడంతో ఇప్పటికే రైళ్లన్నీ చాంతాడంత వెయిటింగ్ లిస్ట్‌తో ఉన్నాయి. మే 9 నుంచి 14 వరకు ఎనిమిది ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే ప్రకటించినా, ఈ సర్వీసులు ఎంత వరకూ సరిపోతాయని సగటు ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. మచిలీపట్నంకు స్పెషల్ ట్రైన్ కూడా వేయలేదని ఐటీ -మిగతా3లో





## ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

- నాలుగు విద్యుత్ ప్లాంట్ల ధ్వంసం!
- శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పరస్పర దాడులు
- 68 డ్రోన్‌లను ప్రయోగించిన ఉక్రెయిన్
- రష్యాలోని రెండు ఆయిల్ రిఫైనరీలు, మిలటరీ ఎయిర్ ఫీల్డ్ ధ్వంసం

# ఉక్రెయిన్‌పై రష్యా భారీ దాడి

ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవలి కాలంలో కొంత వెనక్కి తగ్గిన రష్యా.. మళ్లీ అతి భారీ స్థాయిలో దాడులకు తెగబడింది. ఉక్రెయిన్‌లోని మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా.. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత వరుసగా క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఉక్రెయిన్ లో కీలకమైన నాలుగు విద్యుత్ ప్లాంట్లు ధ్వంసమయ్యాయి. దీంతో ఆ దేశవ్యాప్తంగా కరెంటు సరఫరాపై నియంత్రణలను అమలు చేయాల్సి వస్తున్నట్టు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు.

**మౌలిక సదుపాయాలే లక్ష్యంగా..**

పశ్చిమ దేశాల నుంచి అందుతున్న సాయంతో ఉక్రెయిన్ దీటుగా బదులిస్తుండటంతో.. రష్యా కొంత కాలం నుంచి ఉక్రెయిన్ లోని విద్యుత్ ప్లాంట్లు, ఇతర కీలక మౌలిక సదుపాయాలపై ఫోకస్ చేసింది. వాటిని ధ్వంసం చేయడం ద్వారా ఉక్రెయిన్ ను లొంగదీసుకోవచ్చని భావిస్తోంది. ఈ క్రమంలో రష్యా ఉక్రెయిన్ పై 34 క్షిపణులను ప్రయోగించిందని.. అందులో 21 క్షిపణులను మధ్యలోనే కూల్చేశామని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. మిగతావి తాకడంతో నాలుగు థర్మల్ విద్యుత్ కేంద్రాలు ధ్వంసమైనట్టు వెల్లడించారు. దీనితో విద్యుత్ వినియోగంపై ఆంక్షలు విధించామని.. పీక్ టైంలో ఐరన్ బాక్స్ లు, వాషింగ్ మెషీన్లు వంటివి వినియోగించవద్దని ప్రజలకు సూచించారు.



**దీటుగా దాడికి దిగిన ఉక్రెయిన్**

మరోవైపు ఉక్రెయిన్ కూడా శుక్రవారం రాత్రి రష్యా దక్షిణ ప్రాంతమైన క్రాస్నోదర్ రీజియన్ పై దాడికి దిగింది. 68 డ్రోన్ లను ప్రయోగించింది. అందులో 66 డ్రోన్లను కూల్చేసినట్టు రష్యా డిఫెన్స్ అధికారులు ప్రకటించారు. ఉక్రెయిన్ దాడుల్లో స్లవ్యానస్క్ ప్రాంతంలోని రెండు ఆయిల్ రిఫైనరీ ఫ్యాక్టరీలు ధ్వంసమయ్యాయి. ఒక మిలటరీ ఎయిర్ ఫీల్డ్ కూడా దెబ్బతింది.

# అమ్మేది ఈ ఇద్దరు...కొనేది ఆ ఇద్దరు

**బార్‌పేట:** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మాటల తూటాలు పేలుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హెూం మంత్రి అమిత్‌షాపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రభుత్వ రంగం సంస్థలను మోదీ, అమిత్‌షాలు పారిశ్రామికవేత్తలైన అంబానీ, అదానీలకు అమ్మేస్తున్నారని, బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వానికి దేశ అభివృద్ధికి పట్ల ఎలాంటి చిత్తశుద్ధ లేదని అన్నారు. అసోంలోని బార్‌పేటలో శనివారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఖర్గే మాట్లాడుతూ, ప్రధాని మోదీ పేద ప్రజల సొమ్మును కొల్లగొట్టి ధనవంతులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. "వాళ్లు ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వేలు, రోడ్లు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలను అమ్మేస్తున్నారు. మోదీ, షా ఇద్దరూ అమ్మకందార్లు, మరి కొనుగోలుదారులు ఎవరు? అదానీ, అంబానీలు. ఇదీ దేశాభివృద్ధి. వాళ్లు దేశాన్ని అభివృద్ధి చేయడం లేదు. ప్రధాని దేశ సంపదను కొల్లగొడుతున్నారు. పేదల సొమ్ము కొల్లగొట్టి పెద్దోళ్లకు ఇస్తున్నారు. రూ.16 లక్షల కోట్ల మేరకు ధనికులు తీసుకున్న రుణాలను మాఫీ చేశారు. కానీ పేదలకు, రైతులకు ఇచ్చిందేమీ లేదు" అని ఖర్గే విమర్శించారు.

**నెహ్రూ, ఇందిరపై ప్రశంసలు**



పండిట్ జవహర్ లాలా నెహ్రూ, ఇందిరాగాంధీలు దేశంలో హరిత విప్లవం, శ్వేత విప్లవం తీసుకువచ్చారు. హరిత విప్లవంతో భారతదేశానికి ఆహార భద్రత కల్పించారు, ఎగుమతులకు అవసరమైన మిగులు సృష్టించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ బీహార్‌లోని మోతిహారిలో హరిత విప్లవాన్ని అప్పట్లో ప్రారంభించారు" అని ఖర్గే గుర్తు చేశారు. ఇందుకు భిన్నంగా బీజేపీ వాళ్లు పేదల కోసం పుట్టిన ఏకైక వ్యక్తి మోదీ అంటూ ప్రచారం చేసుకుంటున్నారని తప్పుపట్టారు. ఈరోజు దేశ ప్రజలకు అవసరమైన గోధుమలు, బియ్యం, ధాన్యాలు తగినంత పడించుకుంటున్నామంటే దానికి కాంగ్రెస్సే కారణమని, వారు తీసుకువచ్చిన గ్రీన్ రివల్యూషన్, వైట్ రివల్యూషన్ కారణమని చెప్పారు. కనీసం నీడిల్ కూడా తయారుకాని దేశంలో రాకెట్లు తయారు చేసేందుకు ధైర్యం చేసిన నేతలు నెహ్రూ, ఇందిరాగాంధీ అని కొనియాడారు. కాంగ్రెస్‌ను చూసి భయం పట్టుకున్నందువల్లే నిరంతరం బురదచల్లడం పనిగా మోదీ పెట్టుకున్నారని విమర్శించారు. రాహుల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని అన్నారు. బుల్లెట్ రైళ్ల గురించి మాట్లాడుతున్న మోదీ ఇక్కడకి(అసోం) రైలు తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇక్కడ రైల్వే లైన్‌ను పూర్తి చేస్తామని, బార్‌పేటలో ఆరోగ్య రంగాన్ని పటిష్టం చేస్తామని, 2,500 మందికి పైగా జనాభా ఉన్న గ్రామాల్లో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్ల ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు.

# అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం..

అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గుజరాత్‌కు చెందిన ముగ్గురు భారతీయ మహిళలు దుర్మరణం చెందారు. ఆనంద్ జిల్లాకు చెందిన రేఖాబెన్ పటేల్, సంగీతబెన్ పటేల్, మనీషాబెన్ పటేల్ కారు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ కరోలినాలోని గ్రీన్‌విల్లే కౌంటీలో ఆ ముగ్గురు ప్రయాణిస్తున్న ఎస్‌యూవీ వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయింది. ఎస్‌యూవీ వాహనం అన్ని లేన్లను దాటుకుంటూ.. 20 అడుగుల ఎత్తులో గాలిలోకి వెళ్లిందని, ఆ తర్వాత సమీపంలో ఉన్న చెట్లను ఢీకొన్నట్లు గ్రీన్‌విల్లే కౌంటీ పోలీసులు వెల్లడించారు. వాళ్లు ప్రయాణిస్తున్న వాహనం అతి వేగంగా వెళ్తున్నట్లు చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ తెలిపారు. కారును ఓ చెట్టుపై గుర్తించామని, అది ముక్కలు ముక్కలైందని పోలీసులు వెల్లడించారు. ప్రమాదంలో ఒకరు మాత్రమే గాయాలతో బయటపడి ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వాహనంలో ఉన్న డిటెక్షన్ సిస్టమ్ వల్ల ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. "వారు హైవేపై ప్రయాణించాల్సిన వేగ పరిమితి కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించిన్నట్లు స్పష్టమవుతోంది" అని డబ్ల్యూఎస్‌పీఏ న్యూస్ ఛానెల్‌కి చీఫ్ డిప్యూటీ కరోనర్ మైక్ ఎల్లిస్ తెలిపారు. ఈ ప్రమాదానికి ఇతర కార్ల ప్రమేయం కూడా లేదని ఆయన స్పష్టం చేశారు.



# జైల్లో కుదుటగానే కేజ్రీవాల్ ఆరోగ్యం

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం ప్రస్తుతం కుదుటగానే ఉన్నట్లు తెలుస్తోంది. టైప్-2 డయాబెటిస్‌తో బాధపడుతున్న కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు అయిదుగురు డాక్టర్లతో కూడిన వైద్య బృందం ఆయనకు రెండు యూనిట్ల ఇన్సులిన్ అందిస్తోంది. ఈ మేరకు ఎయిమ్స్‌కు చెందిన అయిదుగురు వైద్యుల బృందం శనివారం కేజ్రీవాల్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. దాదాపు అరగంట పాటు ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ప్రస్తుతం కేజ్రీవాల్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు ధ్రువీకరించినట్లు తెలుస్తోంది. ఈమేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించింది. కేజ్రీవాల్ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నందున, ఆయన ఉపయోగిస్తున్న మందులనే కొనసాగించాలని మెడికల్ బోర్డు సూచించిం.ది మెడిసిన్‌లో ఎలాంటి మార్పులు చేయాల్సిన అవసరం లేదు పేర్కొంది. దీంతో పాటు ఆయనకు రెండు యూనిట్ల ఇన్సులిన్ డోసును కొనసాగించాలని తెలిపింది' అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వారం తర్వాత ఈ బృందం సీఎంను మరోసారి పరీక్షించనున్నట్లు పేర్కొన్నాయి. కాగా ఆయన షుగర్ లెవల్స్ 320కు పెరగడంతో గతవారం తీహార్ జైల్లో తొలి ఇన్సులిన్ అందించారు. తన వ్యక్తిగత వైద్యుడితో రోజూ వీడియో మాధ్యమంలో సంప్రదించే అవకాశాన్ని కల్పించాలంటూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు తిరస్కరించిన విషయం తెలిసిందే.




ఆరోగ్య కారణాల కింద బెయిల్ పొందేందుకే చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండే స్వీట్స్, మామిడిపండ్లు, ఆలూపూరీ వంటి ఆహార పదార్థాలు తీసుకుంటున్నారని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. దీనిపై వాదనలు విన్న న్యాయస్థానం.. కేజ్రీవాల్ అభ్యర్థనను తోసిపుచ్చింది. అయితే టైప్ 2 డయాబెటిక్ పేషెంట్ అయిన కేజ్రీవాల్‌కు క్రమం తప్పకుండా ఇన్సులిన్ అవసరమా?, ఇతర ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? అని నిర్ణయించేందుకు ఎయిమ్స్ వైద్యులతో కూడిన కమిటీని ఏర్పాటుచేయాల్సిందిగా ఆదేశించింది. ఇంట్లో వండిన ఆహారాన్ని కూడా కోర్టు అనుమతించింది. అయితే అది ఖచ్చితంగా డాక్టర్ సూచించిన డైట్ చార్ట్‌కు కట్టుబడి ఉండాలని పేర్కొంది.

## అబద్ధాలు చెప్పడంలో తనకు..తానే దిట్ట..



**బెంగళూరు:** అబద్ధాలు, ప్రజల మనోభావాలను మంటగలిపేలా నరేంద్ర మోదీ ప్రధానమంత్రి పదవి గౌరవాన్ని దెబ్బతీస్తున్నారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య అన్నారు. మోదీ అబద్ధాలు చెప్పడంలో గొప్పవారు. అబద్ధాల్ని మార్కెట్ చేయడంలో దిట్ట. అసంబద్ధమైన మాటలు మాట్లాడి ప్రజల మనోభావాలను రెచ్చగొట్టడం, వారి గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ చర్యలు ప్రధానమంత్రి పదవిపై ఉన్న గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. మోదీ రిజర్వేషన్, మంగళసూత్ర సమస్యలపై కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిందని, వాటిపై ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు. ప్రధాని అబద్ధాలను ప్రజలు బాగా అర్థం చేసుకుంటున్నారన్న సిద్ధరామయ్య ..లోక్‌సభ ఎన్నికల్లోనూ తాము ఇచ్చిన ఎన్నికల హామీలే తమని గెలిపిస్తాయని స్పష్టం చేశారు. మేం ఇచ్చిన ఐదు హామీలు ప్రజల జీవితాలపై ప్రభావం చూపాయి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని విశ్వాసం, నమ్మకం ప్రజల్లో ఉందని. అదే తమ గెలుపుకు మొదటి పెట్టని అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ విచక్షణను బట్టి తీర్పు ఇస్తారని, ఓటర్లు తెలివైన వారని, రాజకీయంగా పరిణతి చెందిన వారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు.

## మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో గాయపడ్డ సంఘటనలు.. ఇవే



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి 'మమతా బెనర్జీ' ఏప్రిల్ 27న దుర్గాపూర్ నగరంలో ఎన్నికల ప్రచారానికి వెళ్ళడానికి హెలికాప్టర్ ఎక్కుతుండగా జారి పడ్డారు. సిబ్బంది అప్రమత్తం కావడంతో ఈ ప్రమాదంలో ఆమె స్వల్ప గాయాల నుంచి సురక్షితంగా బయట పడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ తన నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో అనేకసార్లు గాయపడ్డారు, దాడులకు సైతం గురైనట్లు తెలుస్తోంది. ఈ కథనంలో మమతా బెనర్జీ ఎన్ని సార్లు గాయపడ్డారనే వివరాలు తెలుసుకుందాం..

2024 మార్చిలో మమతా బెనర్జీ నుదిటిపై గాయమైనట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియో వంటివి నెట్టింట్లో తెగ వైరల్ అయ్యాయి. 2023 సెప్టెంబర్‌లో మమతా బెనర్జీ స్పెయిన్ పర్యటనలో ఉన్నప్పుడు ఎడమ కాలికి గాయమైంది. దీంతో 10 రోజులు విశ్రాంతి తీసుకోవాలని డాక్టర్లు సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు స్పెయిన్, దుబాయ్‌లలో 12 రోజుల పర్యటించి మళ్ళీ కోల్‌కతాకు తిరిగి వచ్చారు. జూన్ 2023లో ప్రతికూల వాతావరణం కారణంగా మమతా బెనర్జీ హెలికాప్టర్‌ను ఉత్తర పశ్చిమ బెంగాల్‌లోని సాలుగరాలో అత్యవసరంగా ల్యాండింగ్ చేసారు. ఈ సమయంలో ఆమె మోకాలికి స్వల్ప గాయం కావడంతో కోల్‌కతాలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రికి తరలించారు. మార్చి 2021లో, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, మమతా బెనర్జీ నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన నందిగ్రామ్‌లో దాడికి గురైనప్పుడు ఆమె కాలికి గాయమైంది. ఆ తరువాత చక్రాల కుర్చీలోనే ఎన్నికల ప్రచారం సాగించారు. 34 ఏళ్ల క్రితం మమతా బెనర్జీ కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్న సమయంలో తలకు గాయమైంది. అది అప్పట్లో సంచనంగా మారింది.

## లిక్కర్ కేసు: సుప్రీంకోర్టులో కేజ్రీవాల్ సంచలన అఫిడవిట్



**న్యూఢిల్లీ:** లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తనను అరెస్ట్ చేయడంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు. ఈడీని కేంద్ర ప్రభుత్వం ఎలా దుర్వినియోగం చేస్తుందనడానికి తనను అరెస్టు చేసిన సందర్భమే పెద్ద ఉదాహరణ అని అరోపించారు. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలకు సమాన పోరాట స్థాయి కల్పించాలన్నారు. కానీ తనను అరెస్టు చేసి ఆమ్‌ఆద్మీపార్టీకి ఎన్నికల వేళ తీరని నష్టం చేశారని తెలిపారు. ఇదే సమయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో అక్రమ పద్ధతిలో పైచేయి సాధించిందన్నారు. లిక్కర్ కేసులో తన పార్టీకి సౌత్‌గ్రూపు నుంచి ఎలాంటి ముడుపులు అందలేదని, ఇప్పటివరకు జరిగిన దర్యాప్తులో ఈడీ ఒక్క రూపాయి కూడా పట్టుకోలేకపోయిందని తెలిపారు. లిక్కర్ కేసులో తన అరెస్టు అక్రమమని కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో ఇటీవలే పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారణలో ఈడీ దాఖలు చేసిన కౌంటర్‌కు కౌంటర్‌గా కేజ్రీవాల్ తాజాగా అఫిడవిట్ దాఖలు చేశారు. కాగా, లిక్కర్‌స్కామ్ కేసులో మార్చి21న అరెస్టయిన సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు.

## కుతుబ్ మినార్‌పై కొత్త థీమ్



ఏడు దశల లోక్‌సభ ఎన్నికలకు ఏప్రిల్ 19న (మొదటి దశ) ఓటింగ్ ప్రారంభమైంది. ప్రస్తుతం దేశం మొత్తం ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రజలకు ఓటు హక్కు మీద అవగాహన కల్పించడానికి ఎన్నికల సంఘం ఓ వినూత్న పద్ధతిని ఎంచుకుంది. కుతుబ్ మినార్ మీద త్రివర్ణ పతాకంతో పాటు.. మిరమిట్లు గొలిపే ఎన్నికల సంఘం లోగో కనిపించింది. ఎన్నికల నేపథ్యానికి సంబంధించిన లైట్లు, పోస్టర్లు, విజువల్స్ అన్నీ కుతుబ్ మినార్ మీద ఆకర్షణీయంగా కనిపించాయి. దీనికి సంబంధించిన వీడియోను ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా తన ఎక్స్ (ట్విటర్) పేజీలో పోస్ట్ చేసింది. ఇప్పటికే రెండు దశల ఓటింగ్ ప్రక్రియ పూర్తయింది. మే 3న మూడో దశ, మే 13న నాలుగో దశ, మే 20న ఐదో దశ, మే 25న ఆరో దశ, జూన్ 1న ఏడో దశలో ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడతాయి.

# ఈటల గెలుపుపై మల్లారెడ్డి వ్యాఖ్యలు.. కేటీఆర్ రియాక్షన్

హైదరాబాద్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలవబోతున్నారని ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మల్లారెడ్డి తన రాజకీయం అనుభవంతోనే ఈటలపై ఆ కామెంట్స్ చేశారని పేర్కొన్నారు. మల్లారెడ్డి చాలా తెలివిగల వ్యక్తి అని, ఈటల రాజేందర్‌ను మునగ చెట్టు ఎక్కించి కింద పడేయాలనేది ఆయన వ్యూహమని తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈటలపై చేసిన వ్యాఖ్యల విషయంలో మల్లారెడ్డి తన రాజకీయ అనుభవాన్ని చాటుకున్నారని తెలిపారు. మల్లారెడ్డి మాటల అంతరార్థం తెలియక కొంతమంది ఆగమాగమవుతున్నారని, ఆయన వ్యాక్యాలు సీరియస్‌గా తీసుకోవద్దని తెలిపారు. మల్కాజ్‌గిరిలో కచ్చితంగా గెలిచేది బీఆర్ఎస్సేనని స్పష్టం చేశారు. అది ఈటల రాజేందర్‌కు కూడా తెలుసన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాలు గెలుచుకోబోతుందని చెప్పారు కేటీఆర్. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉండి,నేషనల్ మీడియాలో ప్రధాని మోదీకి ఓటేయ్యండి అంటూ చెబుతున్నారని విమర్శించారు. త్వరలో రేవంత్ ఖచ్చితంగా బీజేపీలోకి వెళతారని పేర్కొన్నారు.



2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇప్పటికీ వరకు ప్రతి ఇంట్లో కేసీఆర్‌ను తలుచుకోని రోజు లేదని అన్నారు. అధికార కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత వస్తోందని దుయ్యబట్టారు. 'రేవంత్ రెడ్డి సీక్వెన్స్ మోసాల సినిమాలు చూపిస్తున్నాడు. దేవుడి మీద ఒట్లు పెడుతూ, ఆగస్టు 15న రైతు రుణమాఫీ చేస్తానని మోసం చేస్తున్నాడు. కొండంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం అన్నాడు కదా. ఇప్పుడు కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారంటీలు అంటున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు సచ్చేది లేదు. 2014లో బడే బాయ్ బడా మోసం చేశారు. అనేక హామీలు ఇచ్చిన మోదీ ఏవీ చేయలేదు. తెలంగాణ పుట్టుకను అవమానించిన వ్యక్తి మోదీ. ప్రపంచ వ్యాప్తంగా క్రుడ్ ఆయిల్ ధరలు తగ్గితే కనీసం పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించలేదు. టోల్ లేని జాతీయ రహదారులు ఉన్నాయా? దేశంలో టోల్ పెట్టీ తోలు తీస్తుంది మోదీ ప్రభుత్వం. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించేందుకు బీజేపీతో జతకట్టి కాంగ్రెస్ డమ్మీ అభ్యర్థులను పెట్టింది . మమ్మల్ని 10 నుంచి 12 సీట్లతో గెలిపించండి. కాంగ్రెస్ మెడలు వంచుతాం. కడియం శ్రీహరి చేసిన ద్రోహం వరంగల్ లో ఏ నాయకుడు చేయలేదు. వరంగల్ ప్రజలను దారుణంగా మోసం చేశారు కడియం. ప్రపంచం వరంగల్ వైపు చూసేలా చేస్తా అంటున్న రేవంత్ రెడ్డి ముందుగా వరంగల్ కళతోరణం రాష్ట్ర అధికారిక ముద్రలో తీసినందుకు క్షమాపణ చెప్పాలి' అని కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రజలు కేసీఆర్‌నే కోరుకుంటున్నారు

**హైదరాబాద్:** రాబోయే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అలాగే, తమను ఎవరెంత కించపరచినా కుంగిపోమని చెప్పుకొచ్చారు. ఎన్నో పోరాటాలతో, లక్ష్యంతో తెలంగాణ సిద్ధించిందని గుర్తు చేశారు. కాగా, నేడు బీఆర్ఎస? పార్టీ ఆవిర్భావ దినోత్సవం. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండాను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు హాజరయ్యారు. అనంతరం, కేటీఆర్ మాట్లాడుతూ.. 'ప్రజాస్వామ్య ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత కేసీఆర్ పార్టీని ఏర్పాటు చేశారు. ఎన్నో పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. అధికార గర్వంతో ఉన్న ఆనాటి కాంగ్రెస్ మెడలు వంచి రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ కృషి చేశారు. కుట్రలు, ప్రలోభాలతో ఉద్యమాన్ని ఆపాలని చూశారు. కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని 2014లో ప్రభుత్వం వచ్చింది. ఎన్నో సమస్యల పరిష్కారం కోసం పార్టీ, ప్రభుత్వం రెండు పని చేశాయి. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రంలో మహారాష్ట్రలో కూడా పార్టీ విస్తరించింది. కానీ, దురదృష్టవశాత్తూ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యం.



ఇప్పుడు ప్రజలు మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది. ఎవరెంత కించపరిచినా మేము కుంగిపోము. 24ఏళ్లలో మాకు ఇచ్చిన గౌరవం, అభిమానానికి ధన్యవాదాలు. వందల మంది రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు వదిలారు. మీ స్ఫూర్తితో మేము ముందుకు వెళ్తాము' అని వ్యాఖ్యలు చేశారు.

# రిజర్వేషన్లు ఎత్తేసేందుకు బీజేపీ కుట్ర

-మొదటి పేజి తరువాయి

భావజాలం... మనువాదభావజాలం కోసం బీజేపీ 400 సీట్లు కోరుతోందని మండిపడ్డారు. రిజర్వేషన్లను రద్దు చేసి హిందూ దేశంగా మార్చాలనేది బీజేపీ కుటిలయత్నమన్నారు. బీసీ రిజర్వేషన్లు పెరగాలంటే జనాభా లెక్క కావాలని... అందుకు కాంగ్రెస్ సిద్ధమన్నారు. కానీ ఏదో రకంగా రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కాంగ్రెస్ ప్రశ్నలకు మోదీ, అమిత్ షాలు సమాధానం చెప్పడం లేదన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తామంటే కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్ ఒక్క మాట మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్ కూడా రిజర్వేషన్ల రద్దు అంశంపై మాట్లాడటం లేదన్నారు. జైల్లో ఉన్న బిడ్డ కోసం బీజేపీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్ పార్టీకి, పోవాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి సాక్షిగా చెబుతున్నానని... పంద్రాగస్ట్ లోగా రుణమాఫీ చేస్తానని పునరుద్ఘాటించారు. హరీశ్ రావులాంటి వ్యక్తులు రాజీనామా చేస్తే పీడ పోతుందన్నారు.




ఎస్సీ, ఎస్టీ, బీసీలపై బీజేపీ సర్జికల్ స్ట్రైక్ చేస్తుంది. రాహుల్ గాంధీపై మోదీ, అమిత్ షా అసత్య ఆరోపణలు చేస్తున్నారు. తాళి పుస్తెలు గుంజుకుంటారని మోదీ లాంటి వారు ప్రచారం చేస్తున్నారు. భార్య ఆస్తి పై భర్తకు హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.. ఇలాంటి సమయంలో ఆస్తులు గుంజుకుంటారని ఆరోపణలు చేస్తున్నారు. ఆర్ఎస్ ఎస్ విధానాలను బీజేపీ అమలు చేస్తుంది. ఈస్ట్ ఇండియా కంపెనీ విధానాన్ని మోదీ,అమిత్ షా అమలు చేస్తున్నారు. రిజర్వేషన్ల రద్దుపై బీజేపీ అధిష్టానం ఎందుకు మౌనంగా ఉంటుంది. జనాభా లెక్కలు జరిగితేనే రిజర్వేషన్ల పెంపు సాధ్యం అవుతుంది.. అందుకే జనాభా లెక్కలు బీజేపీ ప్రభుత్వం చేయడం లేదు" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

"కిషన్‌రెడ్డి, ఈటల ఎందుకు మాట్లాడడం లేదు.. అన్ని విషయాలు మాట్లాడుతున్న కేసీఆర్ ఈ విషయం గురించి ఎందుకు స్పందించడం లేదు?. రిజర్వేషన్ల విషయంలో కేసీఆర్ తన విధానాన్ని ప్రకటించాలి. వంద రోజులకే మమ్మల్ని దిగిపోవాలని అంటున్న కేసీఆర్.. పదేళ్ల బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు అనడం లేదు. మల్కాజిగిరిలో బీజేపీ గెలుస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చెప్తున్నాడంటే బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఒప్పందం జరిగిందని అర్థం అవుతుంది. బీజేపీతో చీకటి ఒప్పందం లేకపోతే మల్లారెడ్డిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయడం లేదు. ఈటలకు వ్యతిరేకంగా కేటీఆర్ ఎందుకు మాట్లాడడం లేదు. భూముల అమ్మకం గురించి ఈటల ఎందుకు మాట్లాడడం లేదు?" అంటూ రేవంత్ ప్రశ్నించారు.

# లోక్‌సభ తర్వాత స్థానిక సమరం

**హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల అనంతరం తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం సమాయత్తం అవుతోంది. ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికలను ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ బాక్సులతో నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈమేరకు బ్యాలెట్ బాక్సులకు సంబంధించిన సీళ్లు, చిరునామా ట్యాగ్‌లను మే 15లోగా ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌ను ఎస్ఈసీ ఆదేశించింది. తెలంగాణలో సర్పంచుల పదవీకాలం గత ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు పదవీకాలం జూలై 3వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎస్ఈసీ కసరత్తు మొదలు పెట్టింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు వాయిదా పడడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఏర్పాట్లు స్పీడప్ చేసింది.ఇక, పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లకు సంబంధించిన రిజర్వేషన్ల వివరాలను కూడా రాష్ట్ర ఎన్నిల సంఘం ఇప్పటికే సేకరించింది. తాజాగా బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో మొదటి నుంచి పంచాయతీ ఎన్నికలను బ్యాలెట్ బాక్సులతోనే నిర్వహిస్తోంది. ఈసారి కూడా అదే రీతిలో జరిపించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ బ్యాలెట్ బాక్సులకు కాగితపు సీళ్లు, చిరునామా ట్యాగ్‌లు అంటించాల్సి ఉంది. దీనికోసం వాటి ముద్రణ చేపట్టాలని నిర్ణయించింది. పేపర్ సీళ్లతోపాటు పోలింగ్ కేంద్రం, గ్రామం, మండలం, జిల్లాలను సూచించే ట్యాగ్‌లను ఆంగ్ల, తెలుగు భాషల్లో ముద్రించాలని నిర్ణయించింది. వీటిని హైదరాబాద్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించాలని పంచాయతీరాజ్ కమిషనర్‌కు సూచించింది.లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జూన్ నాలుగో




తేదీతో ముగుస్తుంది. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే వీలుంది. తేదీలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రావాల్సి ఉంది. బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలో ఇప్పటికే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై కసరత్తు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే జూన్‌లో ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత రెండు మూడు నెలల వ్యవధిలో అభిప్రాయ సేకరణ చేసి నివేదిక సమర్పించే అవకాశం ఉంది. దీనిని ప్రభుత్వం ఆమోదించి రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల సంఘానికి తెలియజేయాల్సి ఉంటుంది

# తెలంగాణలో చిత్రవిచిత్రాలు.

-మొదటి పేజి తరువాయి



ప్రతి రోజు సీఎం, డిప్యూటీ సీఎం కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు" అంటూ కేసీఆర్ దుయ్యబట్టారు. "నాతోపాటు ఉన్న మాజీ ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది?. రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి" అంటూ కేసీఆర్ ఎక్స్(ట్విటర్) వేదికగా విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి గారు, మరియు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది.

కాగా, కేసీఆర్ సోషల్ మీడియాలో అడుగుపెట్టారు. ఎక్స్( ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్‌లో అకౌంట్ తెరిచారు. అయితే ఇంతకాలం కేసీఆర్ సోషల్ మీడియాకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సోషల్ మీడియాలోకి ఎంట్రీ ఇవ్వడం విశేషం.

ఈ నేపథ్యంలో కేసీఆర్ తొలి ట్వీట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శు భాకాంక్షలు తెలుపుతూ కేసీఆర్ తొలి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు ఉద్యమ కాలం నాటి తన ఫొటోను కేసీఆర్ జత చేశారు. బస్సు యాత్రను దిగ్విజయం చేస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమాన ప్రజలందరికీ అభినందనలు, ధన్యవాదాలు. ఇదే ఊపుతో బస్సు యాత్రను ముందుకు కొనసాగిద్దాం, పార్లమెంటు ఎన్నికల్లో గొప్ప విజయం సాధిద్దాం అని కోరుతూ కేసీఆర్ రెండో ట్వీట్ చేశారు.

మూడో ట్వీట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'తెలంగాణ రాష్ట్రంలో చాలా చిత్రవిచిత్రమైన సంఘటనలు జరుగుతున్నాయి. నేను గంట క్రితం మహబూబ్ నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి గారు, మరియు మాజీ ఎమ్మెల్యేలతో కలిసి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ గారి ఇంట్లో భోజనం చేస్తున్నప్పుడు రెండు సార్లు కరెంటు పోయింది. ప్రతి రోజు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కరెంటు పోవడం లేదని ఊదరగొడుతున్నారు. నాతోపాటు ఉన్న మాజీ శాసనసభ్యులు వారి వారి నియోజకవర్గాల్లో రోజుకు పదిసార్లు కరెంటు పోతున్నదని ఈ సందర్భంగా నాకు చెప్పారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న కాంగ్రెస్ పార్టీ పరిపాలనా వైఫల్యానికి ఇంతకన్నా గొప్ప నిదర్శనం ఏముంటుంది? రాష్ట్ర ప్రజలు, మేధావులు ఆలోచించాలి' అని ట్వీట్ చేశారు.

## కాంగ్రెస్‌ను దేశ ప్రజలే నమ్మే పరిస్థితిలో లేరు



-మొదటి పేజి తరువాయి

ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. "దేశాన్ని అభివృద్ధి చేసే అభ్యర్థి కాంగ్రెస్ లో ఉన్నారా. కాంగ్రెస్ ను దేశం నమ్మడం లేదు. కనీసం పీఎం అభ్యర్థి ఎవరో కూడా తెలియదు. ఇక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఎక్కడి వారో తెలియదు. అలాంటి వారికి ఓటెలా వేస్తారు. కొండగట్టుకు, వేములవాడకు నిధులు ఇస్తాం అంటే మాజీ సీఎం కేసీఆర్ సహకరించలేదు. కేసీఆర్‌కు వినోద్ ఎందుకు లేఖ రాయలేదు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు మూడో స్థానమే. కొన్ని చోట్ల ఆ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్లు కూడా దక్కవు. ఎన్నికలు ఉన్నప్పుడే కేసీఆర్ అలారం పెట్టుకుని నిద్ర లేస్తారు" అని సంజయ్ అన్నారు. కరీంనగర్: ఇండియన్ పొలిటికల్ లీగ్‌లో మా కెప్టెన్ మోదీ.. మరి కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థి ఎవరు? అని ప్రశ్నించారు అదే సమయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం జరిగిందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌ను పాతాళంలో పాతిపెట్టడం ఖాయం. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం జరిగింది. బీఆర్ఎస్‌లో బీఫామ్ తీసుకున్న అభ్యర్థులు పార్టీలు మారారంటేనే వాళ్ల చీకటి ఒప్పందాలేంటో బయటపడ్డాయి. వేములవాడను ప్రసాద్ స్కీం కింద పెట్టి అభివృద్ధి చేస్తానంటే పర్మిషన్ ఇవ్వలేదు. ఆర్వోబీ కోసం బీఆర్ఎస్ లేఖ ఇవ్వలేదు.. చివరకు, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే ఆర్వోబీ కడుతున్నాం.

కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం బీజేపీ ప్రభుత్వమే నిధులిచ్చింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎందుకు పోటీ చేస్తున్నాడో.. టికెట్ ఏ విధంగా తెచ్చుకున్నాడో అర్థం కావడం లేదు. బీఆర్ఎస్‌ది మూడో స్థానం కోసం.. కాంగ్రెస్‌ది రెండో స్థానం కోసమే వారి మధ్య పోటీ. ఎన్నికల సమయంలో మాత్రమే కేసీఆర్ బయటకు వస్తాడు అని కామెంట్స్ చేశారు.

## పెరిగిన బస్సు టికెట్ ధర



-మొదటి పేజి తరువాయి

ఉద్యోగి సాయి పేర్కొంటున్నారు.

రైళ్ల సంగతి ఇలాగుంటే ప్రైవేట్ బస్‌ల ఆపరేటర్లు అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ ధరలు పెంచేశారు. సాధారణ చార్జీలతో పోలిస్తే మూడు నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు పశ్చిమగోదావరి జిల్లా నర్సాపూర్‌కు సాధారణ రోజుల్లో బేస్ చార్జీ 720 రూపాయలు ఉంటే, మే 12న 3వేల రూపాయలుగా ఉంది. ఇదే విషయమై ఓ ఫార్మా కంపెనీలో క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తోన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఓటు విలువైనది అంటే ఏమిటో అనుకున్నాం కానీ, ఇంత ఖరీదుగా మారుతుందని అనుకోలేదని వాపోయారు. ఇద్దరి ఓట్ల కోసం రూ.10వేలకు పైగా ఖర్చుచేయాలంటే కష్టమే అని పేర్కొన్నారు. కుర్రకారు మాత్రం చలో ట్యాక్సీ అంటున్నారు. నలుగురైదుగురు కలిసి ట్యాక్సీ మాట్లాడుకుని వెళ్లి ఓటేయనున్నామని, అందులో సందేహాలకు తావే లేదని చెబుతున్నారు.

# సంపాదకీయం

## వారసత్వ దుమారం

వారసత్వ పన్ను విధానం.. అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో అమలులో ఉన్న దీనిని తాము అధికారంలోకి వస్తే భారత్‌లో అమలు చేస్తామని కాంగ్రెస్ నాయకుడు, ఆ పార్టీ ఇండియన్ ఓవర్‌సీస్ చైర్మన్, సోనియాగాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు అయిన శామ్ పిట్రోడా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే దేశవ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. అధికార బీజేపీకి కాంగ్రెస్ పార్టీ కొత్త అస్త్రం ఇచ్చినట్లయింది. అయితే దీనిపై శామ్ పిట్రోడాతోపాటు పలువురు సీనియర్లు వివరణ ఇస్తున్నా.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అమెరికాలో వారసత్వ పన్ను చట్టం అమలులో ఉంది. దీని ప్రకారం.. ఆ దేశంలో ఎవరైనా 100 మిలియన్ డాలర్ల ఆస్తి సంపాదిస్తే.. అతడి మరణానంతరం ఆ ఆస్తిలో 55 శాతం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. 45 శాతం మాత్రమే అతడి వారసులకు చెందుతుంది. ఇది చాలా ఆసక్తికరమైన చట్టం. సంపాదించిన ఆస్తిలో సగానికిపైగా సమాజం కోసం వదులుకోవాలని ఈ చట్టం చెబుతుంది. సంపాదించిన వ్యక్తికే ఈ ఆస్తి మొత్తం చెందదు. అయితే ఇది అమెరికాలోని కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అమలవుతోంది. ఈ చట్టం తనకు బాగా నచ్చిందని శ్యామ్ పిట్రోడా అన్నారు. ఏప్రిల్ 23న ఆయన ఓ ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు రెండో దశ ఓటింగ్‌కు ముందు ఆస్తి పంపిణీపై రాజకీయ గందరగోళం మధ్య, వారసత్వ పన్నుపై ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా చేసిన ప్రకటనపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. ఆయన ప్రకటనపై భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టగా, శామ్ పిట్రోడా ప్రకటనకు కాంగ్రెస్ దూరంగా ఉంది. అమెరికాలో, వారసత్వపు పన్ను చట్టం ఉంది. ఎవరైనా 100 మిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను కలిగి ఉంటే, అతను చనిపోయినప్పుడు అతని పిల్లలకు 45% మాత్రమే బదిలీ అవుతాయి. ప్రభుత్వం మిగిలిన 55% తీసుకుంటుంది. ఇది ఆసక్తికరమైన చట్టమని సామ్ పిట్రోడా పేర్కొన్నారు. మీరు సంపదను సృష్టించారు, మీ సంపదను ప్రజలకు వదిలివేయాలి, మొత్తం కాదు, సగం, ఇది సముచితమని భావిస్తున్నానని, దానిని పేదలకు పంచుతామని శామ్ పిట్రోడా చెప్పారు. "భారతదేశంలో ఆ పరిస్థితి లేదని, ఒకరి సంపద రూ. 10 బిలియన్లు, అతను చనిపోతే, అతని పిల్లలకు రూ. 10 బిలియన్లు చెందుతుందని, ప్రజలకు ఏమీ లభించదు. కాబట్టి దీనిపై దేశవ్యాప్తంగా ప్రజలు చర్చించుకోవాల్సిన అవసరముందన్నారు శామ్ పిట్రోడా. సంపద పునర్విభజనపై కొత్త విధానాలు తీసుకురావల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. సంపద కేవలం ధనవంతుల ప్రయోజనాల కోసం మాత్రమే కాదన్నారు. తాను చేసిన ప్రకటనను సామ్ పిట్రోడా సోషల్ మీడియా వేదికగా సమర్థించకున్నారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో రాశారు. "వాస్తవాలను మాత్రమే ప్రస్తావించానని, వాటి గురించి ప్రజలు చర్చించుకోవాల్సిన అంశాలని చెప్పాను. దీనికి కాంగ్రెస్‌తో సహా ఏ పార్టీ విధానానికి సంబంధం లేదు. 55% తీసేస్తామని ఎవరు చెప్పలేదన్నారు. భారతదేశంలో ఇలాంటివి జరగాలని ఎవరు చెప్పారు? బీజేపీ ఎందుకు భయపడుతున్నాయి? అంటూ శామ్ పిట్రోడా ప్రశ్నించారు. శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. శామ్ పిట్రోడా ప్రకటనపై వ్యాఖ్యానించడానికి నిరాకరించిన కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్, "సామ్ పిట్రోడా సహా ప్రపంచవ్యాప్తంగా చాలా మందికి గురువు, స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శకుడు శామ్ పిట్రోడా. భారతదేశ అభివృద్ధికి ఆయన అసంఖ్యాకమైన, శాశ్వతమైన కృషి చేశారు. అతను ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు. పిట్రోడా తాను బలంగా భావించే సమస్యలపై బహిరంగంగా తన అభిప్రాయాలను వ్యక్తపరుస్తాడు. ఖచ్చితంగా, ప్రజాస్వామ్యంలో ఒక వ్యక్తి తన వ్యక్తిగత అభిప్రాయాలను చర్చించడానికి, వ్యక్తీకరించడానికి, చర్చించడానికి స్వేచ్ఛ ఉంది. పిట్రోడా అభిప్రాయాలు ఎల్లప్పుడూ భారత జాతీయ కాంగ్రెస్ స్థితిని ప్రతిబింబిస్తాయని దీని అర్థం కాదన్నారు జైరాం రమేష్. ప్రస్తుతం తన వ్యాఖ్యలను రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎన్నికల ప్రచారం నుండి దృష్టిని మరల్చడానికి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న ప్రయత్నం అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రమాదకర ఉద్దేశాలు ఒకదాని తర్వాత ఒకటిగా తెరపైకి వస్తున్నాయన్నారు. మధ్యతరగతి ప్రజలపై మరిన్ని పన్నులు విధించాలని రాజకుటుంబానికి చెందిన యువరాజు సలహాదారు కొంతకాలం క్రితం చెప్పారు. ఇప్పుడు ఈ వ్యక్తులు మరో అడుగు ముందుకేశారు. ఇప్పుడు వారసత్వపు పన్ను విధిస్తామని, తల్లిదండ్రుల నుంచి వచ్చే వారసత్వంపై కూడా పన్ను విధిస్తామని కాంగ్రెస్ చెబుతోందని విమర్శించారు. గత పదేళ్లలో దేశంలో ఆర్థిక అంతరాలు భారీగా పెరిగాయని చెప్పారు. సందప పంపిణీ అంటే ఒకరి ఆస్తులు లాక్కొని మరొకరికి ఇవ్వడం కాదు. సంపద కేంద్రీకరణ జరుగకుండా పంచడం. అంటే ఏకస్వామ్యాన్ని నిరోధించడం అని వివరించారు. మన దేశంలో కనీస వేతనాలు దక్కడం లేదని తెలిపారు. వారసత్వం పన్ను అమలు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు..

# ఈ పోరాటం మహిళల భద్రత కోసం



బిజెపి చెప్తున్న మహిళా భద్రత ఒక జుమ్లా మాత్రమే. బిజెపి పాలనలో గత పదేళ్లలో దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయంటున్నారు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలీ. దేశానికి పతకాలు తెచ్చిపెట్టిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీపై ఫిర్యాదులు చేసినా, నిరసన తెలుపుతున్నా ఇటు బిజెపి, అటు ప్రధాని మోడీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడిన నిందితులకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. దేశాన్ని రక్షించుకోవడానికి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి కీలకమైన ఈ ఎన్నికలలో... ప్రజలకు అండగా నిలుస్తున్న, పోరాడుతున్న వామపక్షాలను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా వుందంటున్న మాజీ ఎంపీ, 'ఐద్వా' పూర్వ జాతీయ అధ్యక్షురాలు సుభాషిణీ అలీ 'దేశాభిమాని' ప్రతినిధితో ముచ్చటించారు. ఆ వివరాలు మోడీ నేతృత్వంలోని బిజెపి పాలనలో మహిళలభద్రతపై మీరేం అనుకుంటున్నారు? బిజెపి చెప్తున్న మహిళా భద్రత అనేది అబద్ధం. గత పదేళ్లలో భారతదేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయి. నిందితుల్లో చాలా మంది బిజెపి వారేనన్న విషయాన్ని గమనించాలి. మహిళలపై దాడులు చేసేవారికి, మహిళలను చిత్రహింసలకు గురిచేసే వారికి రక్షణ కల్పించడమే బిజెపి వైఖరి.


మణిపూర్‌లో మహిళలపై చోటుచేసుకున్న హింసను చూశాం. ప్రభుత్వం నుంచి అవసరమైన సాయం అందక వారు నేటికీ శిబిరాల్లోనే తల దాచుకుంటున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై మహిళా రెజ్లర్లు నిరసన తెలుపుతున్నప్పటికి బిజెపి, ప్రధాని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. మోడీ నియోజకవర్గమైన వారణాసిలో బిజెపి మహానగర్ ఐటీ సెల్ కన్వీనర్, అతని గ్యాంగ్ కలిసి ఓ ఐఐటీ విద్యార్థినిపై వేధింపులకు పాల్పడ్డారు. కేసు పెట్టకుండా ఫిర్యాదును వెనక్కి తీసుకోవాల్సిందిగా వారు ఆమెను ఒత్తిడి చేశారు. ఎట్టకేలకు విద్యార్థుల నిరసనలతో నిందితులను అరెస్టు చేశారు. హత్రాస్‌లో 19 ఏళ్ల దళిత యువతిపై నలుగురు అగ్రవర్ణాల వారు అత్యాచారానికి తెగబడడమేగాక, ఆమెను హత్య చేశారు. అయితే ఆ యువతి అబద్ధం చెప్పిందంటూ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి నిందితులకు అనుకూలంగా మాట్లాడారు. బిజెపి ప్రభుత్వంలో మహిళలకు న్యాయం జరుగుతుందన్న, రక్షణ లభిస్తుందన్న విశ్వాసం లేదు. వారు మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ, వారసత్వ ఆస్తి హక్కును సైతం నిరాకరిస్తారు. మా పోరాటం మహిళల భద్రత కోసమే. న్యాయం కోసం మహిళలు చేస్తున్న పోరాటంలో వామపక్షాల పాత్ర ఏమిటి? మహిళల సమస్యలపై నిలబడేందుకు, అవసరమైన సహాయం అందించడానికి వామపక్షాలు ఎప్పుడూ సిద్ధంగా వున్నాయి. గుజరాత్ మారణహోమ సమయంలో సామూహిక అత్యాచారానికి గురైన బిల్కిస్ బానో గురించి అందరికీ తెలిసిందే. ఈ దారుణం జరిగాక నిందితులను పట్టుకునేందుకు ఎనిమిదేళ్లు పట్టింది. ఘటన జరిగిన రెండో రోజున బృందా కరత్, మరియం ధావలే బిల్కిస్ బానోను కలిశారు. కేసు విచారణకు అన్ని విధాలా సహకరిస్తామని వారామెకు భరోసా ఇచ్చారు. అప్పటికి బిల్కిస్ బానోకు 21 ఏళ్ల. అయితే, నిందితులు 15 ఏళ్లుగా జైల్లో ఉన్నారని, వారు 'సంస్కారీ బ్రాహ్మణులు' అని పేర్కొంటూ గుజరాత్ ప్రభుత్వం వారిని నిర్దోషులుగా విడుదల చేసింది. అదే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోట బురుజు నుంచి ప్రసంగిస్తూ బిజెపి పాలనలో మహిళలు సురక్షితంగా వున్నారని చెప్పుకున్నారు. కాగా, ఇది జరిగిన ఏడాదిన్నర తర్వాత నిందితులకు మళ్లీ జైలుశిక్ష విధించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

దేశంలో మైనారిటీలపై జరుగుతున్న హింసకు సంబంధించి.. మైనారిటీల పట్ల మోడీ, బిజెపి అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను మనం అర్థం చేసుకోవాలి. కేరళకు వచ్చి తమకు నచ్చిన ఆహారం తినొచ్చని చెబుతున్న బిజెపి నేతలు ఉత్తరాదిలో మాత్రం అందుకు అనుమతించరు. ఇంట్లో గొడ్డు మాంసం వుందన్న సాకుతో మైనారిటీలను కొట్టి చంపిన ఘటనలు ఎన్నో వున్నాయి. మతం వారికి ఓట్లు రాబట్టే సాధనం. అంతేగాక, వారు చెప్తున్న అందరికీ న్యాయం అనేది ఒక హామీ మాత్రమే. మోడీ ముఖ్యమంత్రిగా వున్న సమయంలో గుజరాత్‌లో అల్లర్లు జరిగాయి. ఆయన ప్రధానమంత్రిగా వున్న సమయంలో మణిపూర్‌లో మైనారిటీ మహిళలను నగంగా వీధుల్లో ఊరేగించిన సంగతి కూడా గుర్తుంచుకోవాలి. ప్రధాన మీడియా బిజెపి గుప్పెట్లో వున్నందున మళ్లీ బిజెపి అధికారంలోకి వస్తుందనే ప్రచారం జాతీయ మీడియాలో జరుగుతోంది. కాని వాస్తవం అది కాదు. దేశంలో ఆకలి, నిరుద్యోగం, మహిళల అభద్రత, నియంతృత్వ భయం వంటి అంశాలపై చర్చిస్తున్నారు. అంతేగాక రాజ్యాంగ హక్కుల నిరాకరణ, రాజ్యాంగ సంస్థల విధ్వంసాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు.

విపక్షాల ఐక్యత అసాధ్యమైన ఉత్తరప్రదేశ్‌లో కొంతమేర ఐక్యత కుదురుతుందన్నది విపక్షాల ఆశ. బీహార్ లోనూ విపక్షాల కూటమిపై ఆసక్తి పెరిగింది. తొలి దశలో ఎన్నికలు పూర్తయిన తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని కూటమి గతం కంటే బలపడింది. ఈసారి బిజెపికి సీట్లు తగ్గుతాయనడంలో సందేహం లేదు. బిజెపికి వామపక్షాలు ఎలా ప్రత్యామ్నాయం కాగలవు? బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సిపిఎం ఎప్పుడూ ముందుంటుంది. ఉదాహరణకు, సిఎఎ ని అమలు చేయబోమని కేరళ ముఖ్యమంత్రి మొదట ప్రకటించారు. సిఎఎ కి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. రైతుల పోరాటంలో కిసాన్ సభ చురుకైన పాత్ర పోషిస్తోంది. కార్మికుల సమస్యలపై సిఐటియు సమరశీలంగా పోరాడుతోంది. ఇది ప్రజలు గమనిస్తూనే వున్నారు. దేశాన్ని రక్షించుకోవడానికి, రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఈ ఎన్నికలు కీలకమైనవి. ఈ సమయంలో%ొ% ప్రజలకు అండగా నిలుస్తున్న వామపక్షాలను శాసనసభలకు, లోక్‌సభకు పంపించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# మేడే స్ఫూర్తితో వర్గ ఉద్యమాలు నిర్మిద్దాం!

ప్రతి సంవత్సరం మే 1ని మేడేగా ప్రపంచ వ్యాప్తంగా తమ హక్కుల సాధన కోసం పోరాడుతామని కార్మికులు ప్రదర్శనలు, సభలు జరుపుతూ ఐక్యతను చాటుతారు. పాలకులు, పెట్టుబడిదారుల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తామని శపథం చేస్తారు. 19వ శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ప్రారంభమైన పారిశ్రామిక విధానం వలన కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయి. వారికి నిర్ణీత పని గంటలు పని లేకపోవటం, ఎటువంటి హక్కులూ లేక పోవటం, రోజులో 14 నుండి 15 గంటల నిర్బంధ పనివేళలు అమలు జరగటం కార్మికుల దుర్భర పరిస్థితికి అద్దం పట్టింది. పనికి వెళ్లినవాళ్లు ఎప్పుడు ఇంటికి తిరిగి వస్తారో తెలియదు. ఇలాంటి పరిస్థితి వేలాది మంది కార్మికులను పొట్టన పెట్టుకుంది. ఇందుకు పారిశ్రామికవేత్తల ధనదాహమే కారణం. దుర్భర పరిస్థితుల నుంచి బయటపడాలనే ఆలోచన కార్మికుల్లో ప్రారంభమైంది. ఆ ఆలోచన లో భాగమే 1884 అక్టోబర్ 7న అమెరికాలోని చికాగో నగరంలో నిర్వహించిన కార్మిక సదస్సు సంఘటిత వాణిజ్య వ్యాపార సంస్థల కార్మిక సంఘాలు ఇందుకు నడుం బిగించాయి. పీడనకు వ్యతిరేకంగా, ఎనిమిది గంటల పని కోసం ఉద్యమించాలని అవగాహన సదస్సులో ఏర్పడింది. ఇందుకు కార్మిక సంఘాలు సన్నాహాలు ప్రారంభించాయి. సమ్మెకు సిద్ధమైనాయి. 1886 మే1 ఉదయం 10 గం. అమెరికా అంతటా సమ్మెసైరన్ మోగింది. 13 వేల పారిశ్రామిక సంస్థలు మూతపడ్డాయి. 3 లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె ప్రారంభమైన 24 గం. తర్వాత కార్మికుల సంఖ్య 4 లక్షలకు చేరింది. చికాగో నగరంలో 40 వేల మంది కార్మికులు తమ కుటుంబాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అనేక దేశాల్లో ఎర్ర జండాలు రెపరెపలాడాయి. ప్రభుత్వాలు బెంబేలుపడ్డాయి. పారిశ్రామిక వేత్తల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. పెట్టుబడిదారుల కనుసైగలతో పోలీసులు జరిపిన కాల్పుల్లో ఆరుగురు కార్మికులు నేలకొరిగారు. కాల్పులకు వ్యతిరేకిస్తూ 1886 మే 4న 'హే' మార్కెట్ కార్మికులతో నిండిపోయింది. ఖబడ్దార్ మమ్ములను కాల్చి చంపుతారా అంటూ కార్మికుల ఆగ్రహావేశాల మధ్య సభ ప్రారంభమైంది. సభపై పోలీసులు



దాడి చేయటంతో కార్మికులు తిరగబడ్డారు. చాలా మంది తలలు పగిలాయి, చేతులు, కాళ్లు తెగిపడ్డాయి. మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిచిపోయింది. ఏడుగురు పోలీసులు, ఎనిమిది మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. కార్మిక నాయకులపై కేసులు బనాయించి 7 గురికి మరణశిక్ష, 8 మందికి 15 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. చికాగో కార్మికుల పై పోలీసుల హింసాకాండను ఖండిస్తూ అనేక దేశాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు జరిగాయి. కార్మికుల అమరత్వం 8 గంటల చట్టానికి నాంది పలికింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల వలస పాలనలో భారత కార్మికులు కూడా దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. రోజుకి 12 నుండి 25 గం. పని చేశారు. ఎటువంటి హక్కులు లేవు. పరిస్థితులను మెరుగుపర్చుకునే ఆలోచనకు వచ్చారు. చికాగో కార్మికుల పోరాటానికి ముందే భారత కార్మికులు 8 గం. పని దినం డిమాండ్ చేశారు.

భారతీయ రైల్వే కార్మికులు 1862లో 8 గం. పని డిమాండ్ చేస్తూ మొట్టమొదటి సమ్మె చేశారు. సమ్మెపై వలస పాలకులు తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. కొందరు కార్మికులు ప్రాణాలు కూడా కోల్పోయారు. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1882-90 మధ్య 25 సమ్మెలు జరిగాయి. బెంగాల్ జూట్ మిల్లుల్లో జరిగిన సమ్మెలు చాలా ముఖ్యమైనవి. 1905లో భారత ప్రభుత్వ ముద్రణాలయ కార్మికులు నెల రోజులు సమ్మె చేశారు. చారిత్రక విజయం సాధించారు. నవంబర్ 18, 1907లో బెంగాల్ లోని అసన్సోల్‌లో తమ డిమాండ్ల సాధన కోసం రైల్వే కార్మికులు సమ్మె చేశారు. ఈ సమ్మె దేశవ్యాప్తంగా విస్తరించింది. బాలగంగాధర్ తిలక్‌పై విచారణను వ్యతిరేకిస్తూ 1908 లో బొంబాయిలోని కాటన్, గ్రీవ్స్ మిల్లు కార్మికులు పని నిలిపి వేశారు. భారతదేశ శ్రామికవర్గం చేసిన మొట్టమొదటి రాజకీయ సమ్మె ఇది. అన్ని బట్టల మిల్లులు, రైల్వేవర్క్‌షాప్‌ల కార్మికులు 1920 సమ్మె చేశారు. బ్రిటిష్ వలస పాలకులు సైన్యాన్ని ప్రయోగించి అణచివేతకు పూనుకోగా 16 మంది కార్మికులు చనిపోయారు, 50మంది గాయపడ్డారు.

నెహ్రూ దగ్గర నుంచి మోడీ వరకు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు జరుపుతూనే ఉన్నారు. సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలు కాపాడుతూనే ఉన్నారు. రాజీవ్ గాంధీతో ప్రారంభమై నూతన ఆర్థిక విధాలు మన్మోహన్ సింగ్ పాలనలో తీవ్రమై ప్రపంచ వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయడంతో పరిపూర్ణమైంది. ఎటువంటి మినహాయింపు లేకుండా మోడీ ప్రభుత్వం నూటికి నూరు శాతం పెట్టుబడిదారీ విధానాలను అమలు జరుపుతున్నది. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లోకి విదేశీ పెట్టుబడులు చొరబడ్డాయి. పి.వి నరసంహరావు, మన్మోహన్ సింగ్ పాలనలో ప్రారంభమైన పెట్టుబడుల ఉపసంహరణ మోడీ పాలనలో పరాకాష్ఠకు చేరి మొత్తం ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను అమ్మకానికి పెట్టారు. 49 పరిశ్రమలను కారుచవకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టారు. బడా వ్యాపార వేత్తలు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను మొండి బకాయిల పేరుతో రద్దు చేశాడు. బిజెపి పార్టీ మొదటి నుంచి కార్మిక వ్యతిరేక విధానాలు కలిగి ఉంది.

# స్థానిక వార్తలు

## నల్ల చట్టాలు తెచ్చిన మోడీ సర్కారుకు బుద్ధి చెప్పండి




**వాస్తవ నేస్తం,భీంపూర్:** దేశవ్యాప్తంగా మూడు నల్ల చట్టాలు తీసుకువచ్చి రైతు నోట్లో మట్టి కొట్టే ప్రయత్నం చేస్తున్న మోడీ సర్కారుకు, బీజేపీ పార్టీకి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆత్రం భాస్కర్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని అందర్ బంద్, జల్కోరి, గుబిడిపల్లి, చింతపల్లి, వడగాం, రాజ్గాడ్, డబ్బకుర్చీ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని రాబోయే పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కను భారీ మెజారిటీతో గెలిపించి బీజేపీ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కోంరం కోటేశ్వర్, ఆదిలాబాద్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మేస్త్రం అన్ను పటేల్, మడావి నాగరావ్ , మథిన్ అహ్మద్,గంద్రత్ జీవన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చోరికి గురైన సెల్ ఫోన్'ను అప్పగించిన పోలీసులు




**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని పిప్పాల్ కోటి గ్రామానికి చెందిన పొలిపాక అశోక్ సెల్ ఫోన్ నేల రోజుల క్రితం చోరికి గురైంది ఈ విషయం ఆయన భీంపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీంపూర్ ఎస్ఐ ప్రదీప్ కుమార్,సిబ్బందితో ఈ సెల్ ఫోన్ ను ప్రత్యేక యాప్ ద్వారా మెదక్ లో పట్టుకొని,స్వాధీనం చేసుకొని శనివారం బాధితుడు అశోక్ కు అప్పగించారు.దీని పై మండల వసూలు పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సంతోష్ కుమార్,శివాజీ,దినేష్ రాథోడ్,తదితరులు పాల్గొన్నారు.

## నీలం మధునే ఎంపీగా గెలిపించండి



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట మండలంలోని ఆరూరు కోణాపూర్ నాగులపల్లి గ్రామాలలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రామ్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీల మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మల జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. మీ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలమదుకు వేయాలని అన్నారు. కాంగ్రెస్ ని తప్ప ప్రజలు వేరే ఏ పార్టీని కూడా నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల కోసమై అనేక పథకాలను ముందు ముందు గా చేపట్టబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన్న ఎంపీటీసీ శ్రీనివాస్, ఆశిర్ రెడ్డి, కోనాపూర్ మాజీ సర్పంచ్ నాయి కోటి మధు, బీసీ సంఘం మాజీ డైరెక్టర్ పట్నం సుభాష్, కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్య అభ్యసించేందుకు దరఖాస్తుల ఆహ్వానం



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** పాలిటెక్నిక్ విద్యను అభ్యసించే%శీ%దుకు ఆసక్తిగల విద్యార్థులు పాలిసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీ వరకు గడవు%శీ%దాని సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు. మే24వ తేదీన అర్హత పరీక్షను నిర్వహింస్తారని పరీక్షకు దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు లకు రూ.250. ఇతరులకు రూ.500చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# వివాదాల్లో తెలంగాణ పోలీసులు.!

క్రమశిక్షణకు మారుపేరుగా ఉండాల్సిన పోలీసులు గీత తప్పుతున్నారు. అనేకసార్లు పరిధిదాటి ప్రవర్తిస్తున్నారు. సొంత లాభం కోసం తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారు. మహిళలతోనూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. రకరకాల కారణాలతో వివిధ హోదాల్లో ఉన్న పోలీసులు వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పోలీసు శాఖ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారు. దీంతో నేరాలను అరికట్టాల్సిన రక్షక భటులే నిందితులుగా మారుతున్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఇలాంటి ఘటనల్లో పోలీసులపై పోలీసులే కేసులు నమోదు చేస్తున్నారు. కాగా, ఇందులో కొందరు సస్పెన్షన్లు, శాఖాపరమైన చర్యలను ఎదుర్కొంటుండగా.. మరికొందరు తమ ఇన్ ఫ్లూయెన్స్ ను ఉపయోగించి చర్యలకు చిక్కకుండా తప్పించుకుంటున్నారనే చర్చ జరుగుతున్నది.

**మహిళలతో మోసం.. అసభ్య ప్రవర్తన..**

ఆదిలాబాద్ లో హెడ్ కానిస్టేబుల్ గా పని చేస్తున్న ఎడిపెల్లి గణేశ్ పై ఇటీవల మావల పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. తనతో అసభ్యంగా ప్రవర్తించాడని ఓ మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. శాఖాపరమైన చర్యలకు రిపోర్ట్ ను పంపనున్నట్లు వెల్లడించారు. గతంలో ఇందల్వాయి ఎస్ఐగా పనిచేసిన బి. మహేశ్ పై అదే పోలీస్ స్టేషన్ లో ఎఫ్ఐఆర్ బుక్ చేశారు. పెండ్లయి, భార్యతో విడాకులు తీసుకున్నా.. ఆ విషయాలను గోప్యంగా ఉంచి తనతో సన్నిహితంగా ఉన్నాడని ఓ యువతి అతడిపై ఫిర్యాదు చేసింది. నిజామాబాద్ మండలంలోని ఓ విలేజ్లో నిందితురాలికి కోర్టు సమన్లు ఇవ్వడానికి వెళ్లిన రూరల్ థాణా కానిస్టేబుల్ కొండూర్ మహేశ్ బాబు 15 ఏండ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడనే ఫిర్యాదుతో అతడ్ని సస్పెండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా వీఆర్ లో సీఐ గా ఉన్న సంపత్ లైంగిక ఆరోపణల్లో పోక్సో చట్టం కింద కేసు నమోదై కటకటాల్లోకి వెళ్లారు. మహిళపై అత్యాచారం చేసిన కేసులో టాస్క్ ఫోర్స్ లో పని చేసిన ఇన్స్పెక్టర్ సైతం సస్పెన్షన్ వేటుకు గురయ్యారు.

**సివిల్ వివాదాల్లోనూ..**

సివిల్ వివాదాల్లో పోలీసులు జోక్యం చేసుకోకూడదని కోర్టుల నుంచి స్పష్టమైన ఆదేశాలున్నా.. కొందరు ఖాకీల తీరు మారడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ హెడ్ కానిస్టేబుల్ స్థల వివాదం కేసులో ఆయనకు మద్దతుగా పోలీసు ఉన్నతాధికారులు సైతం సివిల్ మ్యాటర్స్ లో జోక్యం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఇతరుల స్థలాన్ని కబ్జా చేసి బౌండరీ కట్టుకున్నాడని, స్థల వివాదంపై విచారణ చేపట్టడానికి వచ్చిన మున్సిపల్ అధికారులతో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా.. సిబ్బంది విధులకు ఆటంకం కలిగించాడని మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు చేయడంతో సదరు హెడ్ కానిస్టేబుల్ పై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. గతంలో రియల్ ఎస్టేట్ లో పెట్టుబడుల విషయంలో వచ్చిన వివాదంలో చిక్కడపల్లి మాజీ డిఐపై కేసు నమోదైంది. రూ. 100 కోట్ల విలువైన భూమిని కొట్టేసేందుకు విశ్రాంత ఉద్యోగిపై మేడ్చల్ కు చెందిన ఓ ఎస్ఐ విష ప్రయోగం చేయడం సంచలనం సృష్టించింది. 2023లో కేవలం హైదరాబాద్ పరిధిలోనే 50 మంది పోలీసులు సస్పెన్షన్ కు గురయ్యారు. ఒకరిని డిస్మిస్ చేశారు.

**ఇంకా అనేక వివాదాల్లో..**



స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ)లో ఏఎస్ఐగా పనిచేసే లక్ష్మణ్ బోగస్ పాస్ పోర్టులు జారీ అయ్యేందుకు సహకరించాడని హైదరాబాద్ సీఐడీ ఆఫీసర్లు అతడిని అరెస్ట్ చేశారు. నకిలీ అడ్రస్ లతో పాస్పోర్టుల కోసం అప్లికేషన్లు పెట్టుకున్న వారికి హెల్ప్ చేశాడన్నది ఆయనపై అభియోగం. హైదరాబాద్ లోని ప్రజాభవన్ బారికేడ్లను ఢీకొట్టిన ఘటనలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కొడుకును తప్పించడానికి హెల్ప్ చేశాడన్న ఆరోపణలపై బోధన్ సీఐ ప్రేమ్ కుమార్ పై పంజాగుట్ట పీఎస్ లో కేసు కూడా నమోదైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న వంటి పోలీసు ఉన్నతాధికారులు జైలుపాలయ్యారు. ఇంకా అనేక మంది విచారణను ఎదుర్కొంటున్నారు.

**సరైన చర్యలు తీసుకోకపోవడంతో..**

ఖాకీ డ్రెస్సులో కొందరు పోలీసులు దౌర్జన్యాలు, దందాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సివిల్ తగాదాల్లో, రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో తలదూర్చుతున్నారనే ఫిర్యాదులు అందుతున్నాయి. కొందరు పోలీసులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ సెటిల్ మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే అలాంటి పోలీసులపై డిపార్ట్ మెంట్ ఉన్నతాధికారులు నామమాత్రపు చర్యలతోనే సరిపెడుతుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారనే విమర్శలున్నాయి.

-ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,
9640466464

# ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బంది ప్రతి ఒక్కరూ శిక్షణ హాజరు కావాలి

వాస్తవ నేస్తం,సంగారెడ్డి: జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం నియమితులైన పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు , ఇతర ఎన్నికల సిబ్బందికి మే నెల ఒకటి, రెండు తేదీలలో మే నెల 7, 8 తేదీలలో వారికి కేటాయించబడ్డ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలో శిక్షణా కార్యక్రమాలు రెండు విడుత లలో ఏర్పాటు చేయనున్నట్లు శనివారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడ్డ ఉద్యోగులందరూ విధిగా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడ్డ ఉద్యోగులందరూ శిక్షణ కార్యక్రమం కోసం స్థానికంగా అందుబాటులో ఉండాలన్నారు ఉండాలని ఆదేశించారు. శిక్షణకు హాజరు కానీ ఉద్యోగులకు కఠిన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆదివారం 28న సంగారెడ్డి లోని పీఎస్ఆర్ గార్డెన్లో ఈవీఎంల కమిషనింగ్ పై ఉదయం ఏడు గంటలకు ఏఆర్వోలు ఆర్వోలు సెక్టోరియల్ అధికారులకు ఏఎల్ఎంటి లకు , ఇతర సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పై సూచించిన అధికారులందరూ హాజరు కావాలన్నారు. శిక్షణ కు హాజరైన సిబ్బంది హాజరు తీసుకోవడానికి ఒక ప్రత్యేక సిబ్బందిని ఏఆర్వోలు నియమించాలని, శిక్షణకు అవసరమైన సామాగ్రిని సైతం సిద్ధం చేసుకోవాలని సైతం సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.



# జీవన్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి పార్లమెంట్ కు పంపాలి







**- కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి**

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండల కేంద్రంలో నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి తో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఐదు గ్యారంటీ పథకాలను అమలు చేసామని అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నామని గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక లోటును పూడుస్తూ క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని అన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తూ 500 కె గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆగస్టు 15 లోపు రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారని వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా ఉండి మచ్చలేని నాయకుడు జీవన్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

జీవన్ రెడ్డి స్వయాన రైతు అని వ్యవసాయదారుల కష్టాలు వ్యవసాయదారుడు కి తెలుస్తాయని పార్లమెంట్లో నిజామాబాద్ గళం బలం వినిపించడానికి నియోజకవర్గం అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి జీవన్ రెడ్డి ని పార్లమెంటుకు పంపించాలని విజ్ఞప్తి చేశారు.

అనంతరం పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకం ద్వారా 150 రోజుల పని దినాలు కల్పిస్తూ రోజుకు కనీస వేతనం 400 రూపాయలు వచ్చే విధంగా సంవత్సరానికి 40000 ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేస్తామని తెలిపారు అలాగే ప్రతి పేద మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయల సహాయం అందే విధంగా నారీ న్యాయ్ పేరుతో కాంగ్రెస్ గ్యారంటీ ఉందని అలాగే 30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని తెలిపారు, నియోజకవర్గంలో ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సునీల్ రెడ్డి ఉంటారని ప్రభుత్వ పథకాలను అమలు చేసే బాధ్యత ఆయన పైనే ఉందని నియోజకవర్గంలో ఎవరికైనా అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకుంటే సునీల్ రెడ్డిని సంప్రదించాలని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గల్ఫ్ కార్మికుల పట్ల ఉదారంగా వ్యవహరించి గల్ఫ్ లో చనిపోయిన కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని తెలిపారు. బిజెపి బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకటేనని రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీని ఓడగొట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అలాగే దేశంలో నియంతల వ్యవహరిస్తున్న బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని నియోజకవర్గ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని జీవన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డి, తాహేర్ బిన్ హుందాన్, అరికెల నర్సారెడ్డి, నగేష్, పార్టీ మండలాధ్యక్షుడు సోమ దేవారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శివనోళ్ల శివ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగప్రసాద్, మండల కిసాన్ ఖేత్ అధ్యక్షుడు ముస్కు మోహన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు రేండ్ల రాజారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్'లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** ఆదిలాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్'లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు సోము సురేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి లు అన్నారు. బజార్ హత్నూర్ మండలంలోని ఎల్లయ్య పల్లి గ్రామంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో పథకాలు ప్రారంభించనుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, సుభాష్, రాజేశ్వర్, తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# పిల్లలకు హార్లిక్స్, బోర్నవీటా తాగిస్తున్నారా..



చిన్నపిల్లల్లో శారీరక ఎదుగుదల కోసం చాలామంది తల్లిదండ్రులు ఉదయం తాగించే పాలల్లో హార్లిక్స్ లేదా బోర్నవీటా కలుపుతారు. దానివల్ల పిల్లలకు శక్తి లభిస్తుందని..వారు బలవంతులవుతారని తల్లిదండ్రుల నమ్మకం. వాటి తయారీ కంపెనీలు చేసే ప్రచారం కూడా అలానే ఉంటుంది. గత దశాబ్దాల నుంచి ఈ తంతు ఇలానే సాగుతోంది. ఫలితంగా వీటిని తయారు చేసే హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ వేలకోట్లకు ఎదిగిపోయింది. పైగా వీటికి హెల్త్ డ్రింకులు అనే పేరు పెట్టింది. అయితే మంచి వెనుక చెడు ఉన్నట్టు.. ఈ హెల్త్ డ్రింకుల తయారీలో ఆ కంపెనీ చక్కెర ను అధికంగా కలుపుతున్నట్టు తేలింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ పై ఆగ్రహం వ్యక్తం చేసింది. హెల్త్ డ్రింక్ అనే పేరును తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. పిల్లలకు హార్లిక్స్, బోర్నవీటా తాగించడం సరికాదని ఓ వ్యక్తి కీలకమైన ప్రశ్న లేవనెత్తాడు. దానికి సంబంధించిన ఒక వీడియోని కూడా రూపొందించాడు. దాన్ని సోషల్ మీడియాలో అప్లోడ్ చేయడంతో లక్షలాదిమంది వీక్షించారు. అనంతరం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ దృష్టికి ఈ విషయం వెళ్ళింది. ఈ డ్రింక్స్ సంపూర్ణ ఆరోగ్యానికి సహకరిస్తాయా? అని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ విక్రయించే హార్లిక్స్, బూస్ట్ వంటి ఉత్పత్తులను హెల్త్ డ్రింక్స్ జాబితా నుంచి తొలగించింది. ఇక నుంచి వీటిని ఫంక్షనల్ న్యూట్రిషనల్ డ్రింక్స్ పేరుతో హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ విక్రయించనుంది. ఆ కంపెనీకి సంబంధించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రితీష్ తివారీ ఈ విషయాన్ని విలేకరుల ఎదుట ప్రకటించారు. తాజాగా తాము తీసుకున్న ఈ నిర్ణయం ఉత్పత్తిని, కచ్చితంగా, పారదర్శకంగా అందించేందుకు తోడ్పడుతుందని వెల్లడించారు. ఆ వీడియో చర్చనీయాంశమైన తర్వాత మాల్ట్ ఆధారిత డ్రింక్స్ వల్ల కలిగే ప్రయోజనాలపై దేశవ్యాప్తంగా చర్చ మొదలైంది. హిందుస్థాన్ యూనిలీవర్ వంటి కంపెనీ చక్కర అధికంగా కలపడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం కూడా ఉంది.. మరోవైపు చిన్న పిల్లల వైద్య నిపుణులు కూడా కేంద్ర వాదనలతో ఏకీభవించారు. హిందుస్థాన్ యూనిలీవర్ తయారు చేస్తున్న ఆ ఉత్పత్తుల్లో చక్కర పిల్లల ఆరోగ్యానికి సరికాదని నిరూపించారు.

# ఎండ మండుతోంది.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి..



ఎండలు మండుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి సూర్యుడు నిప్పు కణికలాగా సెగలు కక్కుతున్నాడు. దేశం మొత్తం ఇదే తీరుగా వాతావరణం ఉంది.. 45 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది.. కొన్నిచోట్ల 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది.. దీనిని హీట్ వేవ్ అని పిలుస్తుంటారు. సాధారణంగా మైదాన ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు మించిపోతే దానిని హీట్ వేవ్ అని పిలుస్తారు. మనదేశంలో హిమాలయ పర్వతాల పరిధిలో ఉన్న రాష్ట్రాలు కూడా హీట్ వేవ్ పరిస్థితులకు గురవుతున్నాయంటే వాతావరణం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వాతావరణం వల్ల డిహైడ్రేషన్, హీట్ క్రాంప్స్, హీట్ స్ట్రోక్ ల వంటివి చోటుచేసుకుంటాయి. హీట్ క్రాంప్స్: ఎడెర్నా వాపు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం 102 డిగ్రీల కంటే తక్కువగానే ఉంటుంది. రోగిలో నిసత్తువ కనిపిస్తుంది. నీరసం ఉంటుంది. కనీసం లేచి అడుగు తీసి అడుగు కూడా వేయలేరు. హీట్ ఎగ్జాషన్: ఎండ ప్రభావానికి గురైన వారిలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. అలసట ఉంటుంది. శరీరం బలహీనతకు గురవుతుంది. తల తిరుగుతుంది. భరించలేని తలనొప్పి ఇబ్బంది పెడుతుంది. ఏది తిన్నా వికారం, వాంతులవుతుంటాయి. కండరాలు తిమ్మిరి పడుతుంటాయి. విపరీతంగా చెమటలు వస్తుంటాయి. హీట్ స్ట్రోక్: ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ అంటే 104 డిగ్రీల ఫారన్ హీట్ లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమయంలో మతిమరుపు లక్షణాలు కనిపిస్తాయి. మూర్ఛ లేదా కోమ వంటివి సంభవిస్తాయి. ఇది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. సకాలంలో ఆసుపత్రికి వెళ్ళకుంటే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది. పై మూడింటికి గురైనప్పుడు.. దాహం వేయకపోయినప్పటికీ తగినంత నీరు తాగాలి. ముఖ్యంగా మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం మూడున్నర వరకు బయటకు వెళ్ళకూడదు. ఎటువంటి పనీ చేయకూడదు. మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు మధ్య వంటలు చేయకూడదు. కాలినడకన బయటికి వెళ్లకూడదు. తేలికైన లేదా లేత రంగు, వదులుగా ఉన్న దుస్తులను ధరించాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు కఠినమైన పనులు చేయకూడదు. ప్రయాణాలు చేసేటప్పుడు వాటర్ బాటిల్ పక్కన ఉంచుకోవాలి. ఆల్కహాల్, టీ, కాఫీలు, కూల్ డ్రింక్స్ కు దూరంగా ఉండాలి. ఎందుకంటే ఇవి కార్బోనేటెడ్ శీతల పానీయాలు. ఇవి శరీరాన్ని త్వరగా డీహైడ్రేట్ చేస్తాయి. బయటకు వెళ్ళేటప్పుడు టోపీ లేదా గొడుగు తప్పక ఉపయోగించాలి. తల, మెడ, ఇతర శరీర భాగాలపై తడి వస్త్రాన్ని ఉంచుకుంటే వేడి నుంచి కొంతలో కొంత ఉపశమనం లభిస్తుంది. మజ్జిగ, నిమ్మరసం, ఇతర పండ్ల రసాలను తీసుకుంటే శరీరానికి సత్వర శక్తి లభిస్తుంది.

# స్మోక్ బిస్కెట్లపై నిషేధం




చెన్నైలో రెడీ-టు-ఈట్ స్మోక్ పిటా, స్మోక్ బిస్కెట్లు మరియు లిక్విడ్ నైట్రోజన్ ఉపయోగించి వండిన ఆహారాన్ని నిషేధిస్తూ రాష్ట్ర ఆహార భద్రత విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. తాజాగా కర్నాటక రాష్ట్రానికి చెందిన ఓ బాలుడు పొగ బిస్కెట్లు తిని స్పృహ తప్పి పడిపోయాడు, అందుకు సంబంధించిన వార్త ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. దీంతో ప్రజలలు పెద్ద సంఖ్యలో నైట్రోజన్ ఆహార ఉత్పత్తులను నిషేధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. అయితే గత మూడు రోజులుగా చర్చనీయాంశంగా మారిన స్మోక్ బిస్కెట్లు, స్మోక్ పిటా వంటి లిక్విడ్ నైట్రోజన్ ఫుడ్ ఉత్పత్తుల వినియోగానికి ఇప్పుడు తెరపడింది. దీనికి సంబంధించి రాష్ట్ర ఆహార భద్రతా శాఖ లిక్విడ్ నైట్రోజన్ ఆహార ఉత్పత్తులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసి, ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇంకా ద్రవ మరియు వాయు నైట్రోజన్‌ను ఫుడ్ ప్రాసెసింగ్ మరియు బేకింగ్ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించవచ్చని మరియు దాని కోసం ఆహార భద్రతా విభాగం నుండి అనుమతి తప్పనిసరిగా పొందాలని పేర్కొంది.

# పెరుగులో బెల్లం వేసుకుని తింటే..




పెరుగు మనం నిత్యం తినే ఆహార పదార్థాల్లో అతి ముఖ్యమైనది. చాలా మందికి ఆహారంలో పెరుగు లేనిదే భోజనం పూర్తి కాదు. పెరుగుతో మంచి ఆరోగ్యం మీ సొంతమవుతుంది.ఎక్కువమంది పెరుగును అన్నంతో కలిపి తీసుకుంటారు. కొందరు పెరుగులో ఉప్పు, పంచదార కలిపి తింటారు.. అయితే, మీరు ఎప్పుడైనా పెరుగులో బెల్లం కలిపి తింటే ఎలా ఉంటుందో రుచి చూశారా..? అంతేకాదు..పెరుగులో బెల్లం కలిపి తినటం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.పెరుగు, బెల్లం రెండింటిలోనూ పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. పెరుగు, బెల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలను చూద్దాం. శరీరంలో రక్తం తక్కువగా ఉన్నా అంటే రక్తహీనతతో బాధపడుతున్నవారికి బెల్లం, పెరుగు తినడం వల్ల మేలు జరుగుతుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది శరీరాన్ని అనేక వ్యాధుల నుండి కాపాడుతుంది. పెరుగులో ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఫాస్పరస్ ఉన్నాయి. పెరుగు బెల్లం కలిపి తినటం వల్ల రక్తహీనతను తొలగిస్తుంది. శరీరంలో రక్తం తక్కువగా ఉన్నవారు అంటే రక్తహీనత ఉన్నవారు పెరుగు, బెల్లం తినాలి. దీన్ని రోజూ తీసుకోవడం వల్ల శరీరంలో రక్తం పెరిగి రక్తహీనత సమస్య దూరమవుతుంది. అంతేకాదు.. జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ సరిగా పనిచేయనప్పుడు మలబద్ధకం, విరేచనాలు, వాంతులు సర్వసాధారణం. ఇలాంటి సమయంలో పెరుగు, బెల్లం రోజువారీ తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. పైగా బరువు తగ్గడంలో కూడా పెరుగు బెల్లం సహాయపడుతుంది. మీరు బరువు పెరగడం గురించి ఆందోళన చెందుతుంటే, మీ రోజువారీ ఆహారంలో బెల్లం పెరుగుతో కలిపి తినటం అలవాటుగా చేసుకోండి. పెరుగు, బెల్లం తింటే గంటల తరబడి కడుపు నిండుగా ఉంటుంది. త్వరగా ఆకలి వేయకపోవటంతో అతిగా తినకుండా అడ్డుకుంటుంది. దీంతో బరువు తగ్గుతారు. అలాగే, పెరుగు, బెల్లం కలిపి తినటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. మీ రోగనిరోధక శక్తి బలహీనంగా ఉంటే, మీరు తరచుగా అనారోగ్యానికి గురవుతుంటే పెరుగు, బెల్లం తినాలి. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. జలుబు, దగ్గు వంటి వ్యాధులను నివారిస్తుంది.

# వేసవిలో రోజూ ఒక్క లవంగం తినండి



మన దేశంలో అనేక రకాల సుగంధ ద్రవ్యాలు లభిస్తాయి. వీటిని వంటల్లో, అలాగే ఆయుర్వేద వైద్యంలో కూడా వాడతారు. వివిధ రకాల దినుసులు వంటలకు ప్రత్యేక రుచిని తీసుకొస్తాయి. అయితే వీటిలోని మెడికల్ ప్రాపర్టీస్ కారణంగా అనారోగ్యాలు సైతం రావు. ముఖ్యంగా లవంగాలతో మంచి హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయి. వీటిలోని సమ్మేళనాలు సమ్మర్ సీజన్‌లో వచ్చే ఆరోగ్య సమస్యలకు చెక్ పెడతాయి. ప్రతిరోజూ ఒక లవంగం పలుకు తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. దీనితో ఎలాంటి హెల్త్ బెనిఫిట్స్ ఉంటాయో తెలుసుకోండి. చర్మ ఆరోగ్యం: వేసవి కాలంలో అధిక వేడి, చెమట కారణంగా వివిధ రకాల చర్మ సమస్యలు రావచ్చు. ఆహారంలో వీటిని చేర్చుకుంటే ఈ సీజన్‌లో ఎదురయ్యే స్కిన్ ప్రాబ్లమ్స్ రిస్క్ తగ్గుతుంది. లవంగాల్లో యాంటీ ఏజింగ్ లక్షణాలు ఉంటాయి. ఇవి సమ్మర్‌లో అధిక వేడి వాతావరణం కారణంగా వచ్చే వృద్ధాప్యాన్ని తగ్గిస్తూ, చర్మ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. పోషకాలకు నిలయం: లవంగాల్లో విటమిన్లు, ఖనిజాలు, అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. వీటిలో విటమిన్లు జు, జ, ఞా, ఞ, రైబోఫ్లావిన్, థయామిన్ వంటి దీ-కాంప్లెక్స్ విటమిన్లు, ఆరోగ్యానికి మేలు చేసే యాంటీఆక్సిడెంట్లు సైతం ఉంటాయి. ఇవి శరీరాన్ని ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. లవంగాలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీమైక్రోబియల్ లక్షణాలతో వివిధ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయి. జీర్ణ ఆరోగ్యం: లవంగాల్లోని సమ్మేళనాలు జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇవి జీర్ణ ఎంజైమ్స్ ఉత్పత్తిని ప్రేరేపించడంతో పాటు పేగు లోపలి కదలికలను మెరుగుపరుస్తాయి. లవంగాలు కార్మినేటివ్ ప్రభావంతో గ్యాస్, ఉబ్బరం నుంచి ఉపశమనం కల్పిస్తాయి. యాంటీఆక్సిడెంట్లు: లవంగాల్లో ఎన్నో రకాల యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. నొప్పి నుంచి ఉపశమనం కల్పించే లక్షణాలు వీటి సొంతం.


# ఐరన్ వల్ల ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలున్నాయా




ఇనుము శరీరానికి రక్షణ కవచంగా పరిగణించబడుతుంది. ఇది శరీరానికి బలాన్ని ఇస్తుంది. అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. ఎర్ర రక్త కణాలలో కనిపించే హిమోగ్లోబిన్‌లో ఇనుము ఒక ముఖ్యమైన భాగం. హిమోగ్లోబిన్ ఊపిరితిత్తుల నుండి ఇతర అవయవాలకు ఆక్సిజన్‌ను రవాణా చేయడం. అటువంటి పరిస్థితిలో, ఇనుము లోపం ఉంటే, మొత్తం వ్యవస్థ కదిలిస్తుంది. ఐరన్ కూడా రోగనిరోధక శక్తిని పెంచుతుంది కాబట్టి, దాని లోపం అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరంలో ఐరన్ లేకపోవడం వల్ల ఆయాసం, బలహీనత, కళ్లు తిరగడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు మొదలవుతాయి. శరీరంలో ఐరన్ తక్కువగా ఉండటం వల్ల అలసట ఉంటుంది. శరీరంలోని వివిధ భాగాలకు ఆక్సిజన్ తగినంత మొత్తంలో చేరడం వల్ల అలసట అనుభూతి చెందుతుంది. దీనివల్ల బలహీనత, తలతిరగడం వంటి సమస్యలు కూడా రావచ్చు. శరీరంలో ఐరన్ లోపం ఉన్నప్పుడు, హిమోగ్లోబిన్ కూడా తగ్గుతుంది. అటువంటి పరిస్థితిలో, తగినంత ఆక్సిజన్ లేకపోవడం, దీని కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పెరుగుతాయి. వ్యాయామం, నడక లేదా నడుస్తున్నప్పుడు ఈ సమస్య పెరుగుతుంది. ఐరన్ శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. దీని లోపం వల్ల తలనొప్పి సమస్యలు వస్తాయి. కొన్నిసార్లు ఇనుము లోపం దృష్టి మరియు జ్ఞాపకశక్తిని కోల్పోవడానికి దారితీస్తుంది, ఎందుకంటే అటువంటి పరిస్థితిలో మెదడుకు ఆక్సిజన్ తగినంత మొత్తంలో లభించదు. సెరోటోనిన్ మరియు డోపమైన్ రెండూ శరీరం మరియు మెదడును రిలాక్స్‌గా ఉంచడానికి చాలా ముఖ్యమైన హార్మోన్లు. ఐరన్ స్థాయి తక్కువగా ఉన్నప్పుడు శరీరంలో ఈ రెండు హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. ఇది నిద్రపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది.

# స్థానిక వార్తలు

## ఉద్యోగుల్లో 'డ్రై ప్రమోషన్' అంటే ఏమిటి?



ఏప్రిల్ నెల ముగియడానికి కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. సాధారణంగా ఉద్యోగస్తులు ఈ నెల కోసం చాలా వేచి ఉంటారు. ఎందుకంటే వారి జీతం కూడా పెరుగుతుందని ఆశిస్తుంటారు. మదింపు ఫారమ్‌ల నింపడం తప్పనిసరిగా మీ కార్యాలయంలో కూడా ప్రారంభించబడి ఉండాలి. ప్రమోషన్, ఇంక్రిమెంట్, అప్రైజల్, రోల్ చేంజ్ లాంటి పదాలు ఈ రోజుల్లో ప్రతి ఆఫీసులో వినిపిస్తున్నాయి. అయితే ఈ మదింపు సమయంలోనే ఉద్యోగుల్లో ఓ వింత భయం మొదలైంది. ఆ భయం 'డ్రై ప్రమోషన్', ఈ డ్రై ప్రమోషన్ ఏమిటో తెలుసుకుందాం. ఈ రోజుల్లో ఉద్యోగులు జాబ్ మార్కెట్‌లో ప్రమోషన్ గురించి ఆసక్తిగా ఉన్నారు. దీనికి కారణం ఈరోజుల్లో డ్రై ప్రమోషన్ అనే ట్రెండ్ మొదలైంది. వాస్తవానికి, డ్రై ప్రమోషన్ అనేది ఉద్యోగి తన పోస్ట్ లేదా హోదాను పెంచడం ద్వారా బహుమతి పొందే పరిస్థితి. అయితే దీనితో జీతం పెరగదు ఉంటుంది. దీని కారణంగా మీ పోస్ట్ మారుతుంది. మీకు ప్రమోషన్ వస్తుంది. పని లక్ష్యాలు కూడా మారుతాయి. కార్యాలయ బాధ్యతలు కూడా పెరుగుతాయి. కానీ డబ్బు పరంగా అది తదనుగుణంగా జరగదు. ప్రణాళికా సలహా సంస్థ పెర్ల్ మేయర్ ప్రకారం, కంపెనీలు తమ ప్రతిభను తక్కువ బడ్జెట్‌లో నిర్వహించడం వల్ల డ్రై ప్రమోషన్ పరిస్థితి ఈ రోజుల్లో సర్వసాధారణంగా మారింది. డేటా ప్రకారం.. ఈ సంవత్సరం 13 శాతం సంస్థలు తమ ఉద్యోగులకు కొత్త ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఉద్యోగులకు ప్రమోషన్లు, ప్రోత్సహకాలు, రివార్డ్‌లు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదిక ప్రకారం.. ఈ సంఖ్య 2018 సంవత్సరంలో 8 శాతం ఉండేది. ఇది ఇప్పుడు 13 శాతానికి చేరింది. చాలా మంది ఉద్యోగులకు, డ్రై ప్రమోషన్ చాలా నిరాశపరిచింది. రిట్రెంచ్‌మెంట్ కారణంగా వ్యక్తులు, ఉద్యోగులను తగ్గించే భయం కారణంగా, కంపెనీలు పోస్ట్‌లను మార్చడానికి ఎంచుకుంటాయి.

## భారీగా తగ్గుతున్న ఫారెక్స్ నిల్వలు..



దేశంలో విదేశీ మారకం నిల్వలు(ఫారెక్స్) క్రమంగా పడిపోతున్నాయి. ఈమేరకు భారతీయ రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో కీలక అంశాలను ప్రస్తావించింది. వరుసగా రెండోవారం ఈ నెల 19తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.82 బిలియన్ డాలర్లు కరిగిపోయి 640.334 బిలియన్ డాలర్లకు పరిమితమైనట్లు తెలిపింది. అంతకుముందు వారంలో ఈ నిలువలు 5.401 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయిలో 642.453 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ మారక నిల్వలు మళ్లీ నాలుగేళ్ల తర్వాత ఈ గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. మరోవైపు పసిడి రిజర్వులు పెరుగుతున్నాయి. తాజాగా 1.01 బిలియన్ డాలర్లమేర బంగారు రిజర్వులు పెరిగి 56.808 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఇతర అంతర్జాతీయ కరెన్సీలతో పోలిస్తే రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ప్రధానంగా అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో గత కొన్ని నెలలుగా రూపాయి విలువ క్రమంగా పతనమవుతోంది. దీంతో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.793 బిలియన్ డాలర్లు తరిగిపోయి 560.86 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్‌బీఐ తెలిపింది. డాలర్‌తోపాటు యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొనడం వల్ల విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తులు తరిగిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు

# మారుతీకి విక్రయాల జోష్

న్యూఢిల్లీ: జనవరి-మార్చి త్రైమాసికంలో మారుతీ సుజుకీ ఇండియా నికర లాభం 47.8 శాతం పెరిగి రూ.3,877.70 కోట్లుగా నమోదైంది. కిందటేడాది ఇదే సమయంలో నికర లాభం రూ.2,623.60 కోట్లుగా ఉంది. అధిక విక్రయాలు, కమొడిటీ ధరల సానుకూలతలు, వ్యయ నియంత్రణ చర్యలు లాంటివి లాభంలో వృద్ధికి దోహదం చేశాయని కంపెనీ తెలిపింది. 2023-24లో మారుతీ తొలిసారిగా 20 లక్షల వాహనాల వార్షిక విక్రయాలను నమోదు చేసింది. అలాగే పూర్తి ఆర్థిక సంవత్సరానికి నికర లాభం రూ.13,209.40 కోట్లకు చేరగా.. 2022-23లోని రూ.8,049.20 కోట్లతో పోలిస్తే 64 శాతం పెరిగింది. వరుసగా మూడో సంవత్సరం కూడా అగ్రగామి ఎగుమతిదారుగా మారుతీ నిలిచింది. 2023-24లో కంపెనీ మొత్తం వాహన విక్రయాలు 8.6 శాతం పెరిగి 21,35,323 వాహనాలుగా నమోదయ్యాయి. ఇందులో దేశీయ విక్రయాలు 18,52,256 వాహనాలు కాగా.. ఎగుమతులు 2,83,067 వాహనాలుగా ఉన్నాయి. 2023-24లో నికర విక్రయాలు రూ.1,34,937.80 కోట్లుగా నమోదయ్యాయి. 2022-23లోని రూ.1,12,500.80 కోట్లతో పోలిస్తే 19.9 శాతం పెరిగాయి.


జనవరి- మార్చి విషయానికొస్తే... మారుతీ మొత్తం విక్రయాలు 13.4 శాతం పెరిగి 5,84,031 వాహనాలకు చేరాయి. దేశీయ విక్రయాలు 5,05,291 వాహనాలుగా నమోదయ్యాయి. ఎగుమతులు 78,740 వాహనాలు కాగా..




ఏడాదిక్రితం ఇదే త్రైమాసికంలో ఎగుమతి చేసిన 64,719 వాహనాలతో పోలిస్తే 21.7 శాతం పెరిగాయి.నికర విక్రయాలు రూ.30,821.80 కోట్ల నుంచి రూ.36,697.50 కోట్లకు పెరిగాయి.రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.125 (2500%) డివిడెండును డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. కంపెనీ చరిత్రలో ఇదే అత్యధికం కావడం విశేషం.

# 'కూ' ఉద్యోగులకు జీతాలు నిలిపివేత

**న్యూఢిల్లీ :** ప్రపంచంలో తీవ్రంగా ప్రాచుర్యం పొందిన ట్విట్టర్ (ప్రస్తుతం 'ఎక్స్')కు పోటీగా మోడీ సర్కారు భారతీయ మైక్రోబ్లాగింగ్ యాప్ 'కూ'కు తీవ్ర ప్రచారాన్ని కల్పించింది. అయితే, ఇప్పుడు ఆ కూ తన సంస్థలోని ఉద్యోగులకు జీతం చెల్లించలేని పరిస్థితుల్లోకి వెళ్లిపోయింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ ఉద్యోగులందరికీ జీతాల చెల్లింపును నిలిపి వేసింది. ఈ విషయాన్ని కంపెనీ వెల్లడించింది. 2020లో, ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభణ సమయంలో, చాలా మంది కేంద్ర మంత్రులు, బిజెపి నాయకులు 'కూ'కు మారారు. తమ అకౌంట్లను సృష్టించుకున్నారు. దీంతో ఈ యాప్‌నకు అప్పట్లో ప్రభుత్వ పరంగానే విపరీత ప్రచారం కలిగింది. "మేము కూ కోసం వ్యూహాత్మక భాగస్వాములతో చర్చలు జరుపుతున్నాం. ఇది ఊహించిన దాని కంటే ఎక్కువ సమయం తీసుకుంటుంది. భాగస్వామ్యాన్ని పొందడానికి, మేము గత జీతాలను తీర్చడానికి కూడా గణనీయమైన వ్యక్తిగత నిధులను ఖర్చు చేశాం" అని కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. 2022, జూన్ నుంచి కంపెనీ తన ఉద్యోగులను 80 శాతం తగ్గించింది. చాలా మంది ఉద్యోగుల జీతాలు 40 శాతం వరకు తగ్గాయని ఒక నివేదిక పేర్కొన్నది. జీతంలో గణనీయమైన కోత తర్వాత ఈ సంవత్సరం ప్రారంభంలో




సీనియర్ ఉద్యోగులు కంపెనీని విడిచిపెట్టారు.డిజిటల్ హక్కుల కార్యకర్త నిఖిల్ పహ్వా 2022లో బిబిసితో మాట్లాడుతూ.. ట్విట్టర్‌కు ప్రత్యామ్నాయంగా 'కూ'ని స్వదేశీ, జాతీయవాద దృక్పథంతో ప్రోత్సహించడానికి మోడీ ప్రభుత్వం ప్రచారం కల్పించింది. దీంతో మైక్రోబ్లాగింగ్ యాప్‌నకు ఇది సానుకూలంగా మారింది. ఒక స్థాయిలో అప్పటి ట్విట్టర్‌కు తీవ్ర పోటీనే ఇచ్చింది అని తెలిపారు. నివేదిక ప్రకారం.. కంపెనీ కేవలం రూ. 14 లక్షల నిర్వహణ ఆదాయాన్ని కలిగి ఉన్నది. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.197 కోట్ల నష్టాన్ని చూసింది. కస్టమర్ సముపార్జన ప్రచారాలపై అధికంగా ఆధారపడుతున్నది. 2022, జూన్‌లో ఆన్‌బోర్డ్ కొత్త వినియోగదారులకు చెల్లింపు ప్రచారాలను నిలిపివేసిన తర్వాత.. దాని వినియోగదారులు 72 లక్షల నుంచి 27 లక్షలకు పడిపోయారని నివేదిక పేర్కొన్నది.

# స్పోర్ట్స్

## ముంబయిని ఊరించి చేజారిన విజయం...

# భారీస్కోర్ల మ్యాచ్‌లో ఢిల్లీ విన్నర్

**అరుణ్ జైట్లీ స్టేడియంలో పరుగుల వాన**

**ఢిల్లీ, ముంబయి ఇండియన్స్ మ్యాచ్ లో మొత్తం 504 పరుగుల నమోదు**

**మొదట 20 ఓవర్లలో 4 వికెట్లకు 257 పరుగులు చేసిన ఢిల్లీ క్యాపిటల్స్**

**ఛేదనలో 9 వికెట్లకు 247 పరుగులు చేసిన ముంబయి**

**కేవలం 10 పరుగుల తేడాతో ఢిల్లీ విజయం**



ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో పరుగుల వర్షం కురిసింది. ఢిల్లీ క్యాపిటల్స్, ముంబయి ఇండియన్స్ మధ్య మ్యాచ్ లో మొత్తం 504 పరుగులు నమోదయ్యాయంటే బ్యాట్స్ మెన్ ఏ రేంజిలో వీరవిహారం చేశారో అర్థమవుతుంది. ఈ మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ 10 పరుగుల తేడాతో విజయం సాధించినప్పటికీ, లక్ష్యానికి చేరువగా వచ్చిన ముంబయి ఇండియన్స్ కూడా తన పోరాటపటిమతో ఆకట్టుకుంది. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 257 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్యఛేదనలో ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 247 పరుగులు నమోదు చేసింది. ఆఖర్లో టిమ్ డేవిడ్ అవుట్ కావడం ముంబయికి మ్యాచ్ ను దూరం చేసింది. ముంబయి ఇన్నింగ్స్ లో ఓపెనర్ ఇషాన్ కిషన్ 20, సూర్యకుమార్ యాదవ్ 26 పరుగులు చేశారు. రోహిత్ శర్మ 8 పరుగులకే అవుటై నిరాశకు గురిచేశాడు. దాంతో ముంబయి ఇండియన్స్ 65 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా జోడి ఎదురుదాడికి దిగింది. హార్దిక్ పాండ్యా 24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులతో 46 పరుగులు చేసి రసిక్ సలామ్ బౌలింగ్ లో వెనుదిరిగాడు. ఆ తర్వాత వచ్చిన నేహాల్ వధేరా (4) వెంటనే అవుటైనా... టిమ్ డేవిడ్ రూపంలో తిలక్ వర్మకు మంచి జోడీ దొరికింది. వీరిద్దరూ ఎడాపెడా బాదేయడంతో ముంబయి విజయం ఈజీనే అనిపించింది. అయితే, టిమ్ డేవిడ్ ను ముఖేశ్ కుమార్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ముంబయికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. టిమ్ డేవిడ్ 17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సులతో 37 పరుగులు చేశాడు. ఆ తర్వాత తిలక్ వర్మ కూడా రనౌట్ కావడంతో ముంబయి ఆశలు అడుగంటాయి. తిలక్ వర్మ 32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులతో 63 పరుగులు చేశాడు. ఆఖర్లో నబీ (7), పియూష్ చావ్లా (10) పోరాడినా లక్ష్యఛేదన వారి శక్తికి మించిన పనైంది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో రసిక్ సలామ్ 3, ముఖేశ్ కుమార్ 3, ఖలీల్ అహ్మద్ 2 వికెట్లు తీశారు.



### ఫ్రేజర్, స్టబ్స్ వీరబాదుడు

ఐపీఎల్ పదిహేడో సీజన్‌లో రెండొందలు కొట్టడం కామన్ అయింది. పవర్ హిట్టర్ల మెరుపులకు బంతి చిన్నబోతుండగా.. స్టాండ్స్‌లోని ప్రేక్షకులు పరుగుల వర్షంలో తడిసి ముద్దవుతున్నారు. కోల్‌కతాపై పంజాబ్ కింగ్స్ రికార్డు విజయాన్ని మరువకముందే ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ చరిత్రలో భారీ స్కోర్ బాదేసింది. సొంత మైదానంలో ఢిల్లీ కుర్రాడు జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ సిక్సర్లతో విరుచుకుపడగా.. మిడిల్‌లో షాయ్ హెూప్(41), ట్రిస్టన్ స్టబ్స్(48 నాటౌట్), కెప్టెన్ రిషభ్ పంత్(29)లు విధ్వంసం సృష్టించారు. దాంతో, పంత్ సేన 4 వికెట్ల నష్టానికి 257 రన్స్ చేయగలిగింది. టాస్ గెలిచి ఢిల్లీకి బ్యాటింగ్ అప్పగించిన ముంబైకి ఫ్రేజర్ ముంబై పేసర్లుకు పట్ట పగలే చుక్కలు చూపించాడు. బుమ్రాతో సహా అందర్నీ ఉతికారేస్తూ కేవలం 15 బంతుల్లోనే మరోసారి హాఫ్ సెంచరీ బాదేశాడు. అతడికి అండగా అభిషేక్ పొరెల్() కూడా తొలి వికెట్‌కు 114 రన్స్ జోడించారు.ఢిల్లీ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. 27 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో ముంబై బౌలర్ల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీశాడు. ఆ తర్వావ వచ్చిన పంత్(29).. హెూప్(41), స్టబ్స్‌తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అంతే.. 17వ ఓవర్‌లోనే ఢిల్లీ స్కోర్ 200 దాటింది.

### ఒక్క బంతిని వదల్లే

హెూఫ్ వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్(48 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ల్యూక్ వుడ్ వేసిన 18వ ఓవర్‌లో రెచ్చిపోయిన స్టబ్స్ ఒక్క బంతిని వదలకుండా వరుసగా.. 4, 4, 6, 4, 4, 4 బాదేశాడు. ఆ తర్వాత పంత్ ఔటైనా.. స్టబ్స్, అక్షర్ పటేల్ (11 నాటౌట్)లు ధనాధన్ ఆడి ఢిల్లీకి భారీ స్కోర్ అందించారు. ముంబై బౌలర్లలో నబీ, బుమ్రా, చావ్లా, వుడ్ తలా ఒక్కో వికెట్ పడగొట్టారు.

## ఉబెర్ కప్‌లో బోణీ.. టీమిండియాకు భారీ ఆధిక్యం



ప్రతిష్ఠాత్మక ఉబెర్ కప్‌లో భారత అమ్మాయిల జట్టు బోణీ కొట్టింది. సింగిల్స్, డబుల్స్‌లో జయభేరి మోగించింది. శనివారం జరిగిన తొలి గ్రూప్ దశ మ్యాచ్‌లో కెనడాపై అద్భుత విజయం నమోదు చేసింది. మొదటి మూడు మ్యాచ్‌లు టైగా ముగియగా.. చివరకు భారత్ 3-0 ఆధిక్యం సాధించింది. తొలి మ్యాచ్‌లో అశ్మిత చాలిహ 26-24, 24-22తో మిచెల్లె లీని చిత్తు చేసింది. 42 నిమిషాల పాటు హెూరీ హెూరీగా సాగిన పోరులో మిచెల్లెపై పై చేయి సాధించింది. ఆ తర్వాత డబుల్స్‌లో ప్రియ కొంజెగ్బమ్ %-% శృతి మిశ్రాలు కెనడా జంటపై సూపర్ విక్టరీ కొట్టారు. వరుస మ్యాచుల్లో గెలుపొంది త్రివర్ణ పతకాన్ని రెపరెపలాడించారు. తొలుత క్యాథెరిన్ చోయి , జెస్లిన్ చోపై 21-12, 21-10తో విజయం సాధించింది. ఇషారాణి బరుహ్ సైతం తన రాకెట్ పవర్ చూపిస్తూ 21-13, 21-12తో గెలుపొందింది.

# ప్రభాస్ 'కల్కి' కొత్త రిలీజ్ డేట్ వచ్చేసింది



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్ కనిపిస్తున్నారని చిత్రి యూనిట్ ఇప్పటికే ప్రకటించేసింది. కానీ పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. కానీ, ఆ సమయంలో దేశవ్యాప్తంగా ఎన్నికల కారణంగా ఈ సినిమాను వాయిదా వేశారు. మే 9న విడుదల కావాల్సిన కల్కి.. జూన్ 27న విడుదల కానున్నట్లు అధికారికంగా ప్రకటన వచ్చేసింది. ఈ మేరకు చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా విడుదలైన పోస్టర్‌లో అమితాబ్, ప్రభాస్, దీపికా పదుకోన్ యోధుల మాదిరి కనిపిస్తున్నారు. గత కొద్దిరోజులుగా కల్కి వాయిదా గురించి వార్తలు వస్తున నేపథ్యంలో ఎట్టకేలకు చిత్ర మేకర్స్ అధికారికంగా ప్రకటించడంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు. వాస్తవంగా కల్కి సినిమాను మే 9వ తేదీన విడదల చేయాలని ప్రకటించారు. ఈ తేదితో వైజయంతీ మూవీస్‌కీ ఎంతో అనుబంధం ఉంది. ఈ సంస్థ నిర్మించిన జగదేక వీరుడు అతిలోక సుందరి, మహానటి, మహర్షి చిత్రాలు మే 9నే విడుదలై ఘన విజయాన్ని అందుకున్నాయి. దీంతో కల్కి 2898 %ూణ% చిత్రాన్ని కూడా అదే రోజునే విడుదల చేస్తామని వైజయంతీ మూవీస్ గతంలో ప్రకటించింది. కానీ ఎన్నికల నేపథ్యంలో వారి నిర్ణయాన్ని మార్చుకున్నారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తామని చిత్ర మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇందులో ప్రభాస్, అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పఠానీ కీలక పాత్రలు పోషించారు.

# అవన్నీ రూమర్సే!



ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన చిత్రం 'సలార్'. గతేడాది డిసెంబరులో విడుదలైన ఈ పాన్ ఇండియా మూవీ బాక్సాఫీసు వద్ద ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. దీని సీక్వెల్ కోసం ప్రభాస్ అభిమానులు, సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాలో హీరోయిన్ శ్రుతి హాసన్‌తో పాటు బాలీవుడ్ నటి కియారా అద్వాణీ కీలక పాత్ర పోషించనున్నారని, ప్రత్యేక గీతంలోనూ ఆమె ఆడిపాడనున్నారని ప్రచారం జరిగింది. అవన్నీ రూమర్సేనని ఓ ప్రముఖ బాలీవుడ్ మీడియా సంస్థ పేర్కొంది. 'సలార్ 2' టీమ్ కియారాను సంప్రదించలేదని ఆమె సన్నిహిత వర్గాలు స్పష్టం చేసినట్టు చెప్పింది. కియారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. 'భరత్ అనే నేను'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ 'వినయ విధేయ రామ'లోనూ సందడి చేశారు. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'గేమ్ ఛేంజర్'లో నటిస్తు న్నారు. 'శౌర్యాంగ పర్వం' పేరుతో 'సలార్ 2' తెరకెక్కనుంది. తొలి భాగంలో ప్రధాన పాత్ర పోషించిన మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతి బాబు తదితరులు రెండో భాగంలోనూ కనిపించనున్నారు. ఈ సీక్వెల్‌పై ఓ ఇంటర్వ్యూలో నిర్మాత విజయ్ కిరగందూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సలార్ 1'.. పార్ట్ 2కు ట్రైలర్ లాంటిది. సలార్ పార్ట్ 2.. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'లా ఉండనుంది. యాక్షన్, డ్రామా, పాలిటిక్స్.. ఇలా పలు అంశాలు సీక్వెల్‌లో కనిపిస్తాయి. దర్శకుడు పార్ట్ 1లో పాత్రలన్నింటినీ పరిచయం చేశారు. సీక్వెల్ చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయి" అని తెలిపారు. జూన్ లేదా జులైలో చిత్రీకరణ ప్రారంభించి, వచ్చే ఏడాది వేసవిలో విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

# సంచలనంగా యాంకర్ అనసూయ పోస్ట్!



అనసూయ భరద్వాజ్ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్స్ లో ఉంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టీవ్ గా ఉంటూ పలు విషయాలపై స్పందిస్తుంది.తాజాగా అనసూయ ఓ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. ఆడవారి వేషధారణ, వారు ధరించే దుస్తుల వల్లనే మానభంగాలు జరుగుతున్నాయి అనే వాదనకు వ్యతిరేకంగా తన అభిమాని పెట్టిన పోస్ట్ పై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. అనసూయ అభిమాని ఒకరు ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. అమ్మాయిలు స్కర్ట్ వేసినా .. జీన్స్ వేసినా .. సంప్రదాయ దుస్తులు ధరించినా .. ఇంటి నుంచి బయటకు వెళ్లినా .. ఇంట్లో ఉన్నా ఎవరొకరి చేత మానభంగానికి గురవుతున్నారు. అమ్మాయిలు ధరించే దుస్తుల వల్ల కాదు .. మన మైండ్ సెట్ మార్చుకోవాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు, రేప్ లు ఆగుతాయి అని పోస్ట్ పెట్టారు. సదరు పోస్ట్ చూసి అనసూయ స్పందిస్తూ .. నేను నా వాళ్ళు అనుకునే వాళ్ళు వీళ్ళు. నన్ను అభిమానించే వారు కొందరి ఫ్యాన్ పేజీల మాదిరిగా ఎవరిని దూషించరు. ఎవరిని టార్గెట్ చేసి రెచ్చగొట్టరు. ఎవరిని ట్రోల్ చేసి ఇబ్బందులకు గురి చేయరు. అనవసరంగా ఎవరినీ అగౌరవ పరచరు. వీళు ్ళ వాళ్ళ బాధ్యత నుంచి పారిపోరు. మంచి మనసుతో ఉండే వారిని చూస్తే నాకు గర్వంగా ఉంటుంది. ఇక కొందరు ఫ్యాన్ పేజీలు మెయింటైన్ చేసేవారు గుమ్మడి కాయల దొంగలు. అనవసరంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంటారు. జంతువుల మాదిరిగా ప్రవర్తిస్తూ ఉంటారు. దీనిని కూడా ట్రోల్ చేస్తారని తెలుసు. అయినా నేను చాలా స్ట్రాంగ్ గా ఉంటాను. నా చుట్టూ ఉన్న వాళ్ళంతా మంచి మనుషులు.



# సీతాదేవిగా సాయి పల్లవి.. లుక్ అదిరిందిగా..

పాన్ ఇండియా భారీ బడ్జెట్ సినిమా అయిన 'రామాయణ్' షూటింగ్ షురువైంది. ఎలాంటి హంగామా, హడావిడి లేకుండా షూటింగ్ మొదలు పెట్టేశారు. సాయిపల్లవి సీతాదేవిగా, రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి గెటప్‌లో ఉన్న ఫొటోలు కొన్ని సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సీతాదేవిగా సాయిపల్లవి లుక్ అదిరింది. ఆ ఫొటోలను చూసి నెటిజన్స్ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. మరీ ముఖ్యంగా సాయిపల్లవి అందానికి ఫిదా అవుతున్నారు. ప్రతిష్టాత్మక రామాయణం ఆధారంగా ఇప్పటి వరకు ఎన్నో సినిమాలు వచ్చాయి. దాదాపుగా ఆ అన్ని సినిమాలు ప్రేక్షకాదరణ పొందాయి. అయితే పోయిన ఏడాది విడుదలైన 'ఆదిపురుష్' మాత్రం విపరీతంగా ట్రోలింగ్‌కి గురైంది. ఇప్పుడు బాలీవుడ్‌లో రామాయణాన్ని సినిమాగా తీస్తున్నారు. బాలీవుడ్‌లో రామాయణం సినిమా తీస్తున్నట్లుగా గతంలో వార్తలు వచ్చినప్పటికీ వాటిని ఎవరూ నిర్ధారించలేదు. శ్రీరామ నవమికి ప్రకటన వస్తుందేమోనని అంతా భావించారు. కానీ అలాంటిదేం జరగలేదు. దాంతో బాలీవుడ్‌లో రామాయణం సినిమా వస్తుందనే వార్తలు ఉత్తవే అనుకున్నారు. ౦ంకానీ ఇప్పుడు రామాయణం సినిమా సెట్స్ నుంచి రాముడు, సీత పాత్రలకు సంబంధించిన కొన్ని ఫొటోలు లీకయ్యాయి. సోషల్ మీడియాలో ఇవి ఫుల్‌గా సర్క్యులేట్ అవుతున్నాయి. లుక్స్ బాగున్నాయి. అయితే ఈ సినిమాను మూడు భాగాలుగా తెరకెక్కిస్తున్నారట. ఇందులో రావణుడిగా 'కేజీఎఫ్' ఫేమ్ యష్ కనిపించనున్నారు.

# శ్రీలీల ఇలా షాకిచ్చిందేంటి?



శ్రీలీల పెళ్లి సందడి సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి తనకంటూ మంచి పేరు సంపాదించుకోవడమే కాకుండా ఇండస్ట్రీలో తనదైన రీతిలో వరుస సినిమాలు చేస్తూ ముందుకు దూసుకెళు ్తంది.ఇక రీసెంట్ గా గుంటూరు కారం సినిమాలో హీరోయిన్ గా నటించింది. అయితే ఈ సినిమా అనుకున్న రేంజ్ లో సక్సెస్ కానప్పటికీ తనకు మాత్రం హీరోయిన్ గా మంచి గుర్తింపు అయితే వచ్చింది. ఇక ఇప్పుడు ఆమె తెలుగుతో పాటుగా తమిళ్ సినిమాల్లో కూడా నటించడానికి ఆసక్తి చూపిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇక అందులో భాగం దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న ఒక సినిమాలో తను ఐటెం సాంగ్ చేయడానికి కూడా ఒప్పుకున్నట్టుగా వార్తలైతే వస్తున్నాయి.ఇక ఇప్పటి వరకు తను ఏ సినిమాలో కూడా ఐటెం సాంగ్ చేయలేదు. వరుస గా హీరోయిన్ గానే చేస్తూ సక్సెస్ లు అందుకుంటూ ముందుకు దూసుకెళ్తుంది. ఒక దళపతి విజయ్ పొలిటికల్ పార్టీ పెట్టిన విషయం మనకు తెలిసిందే. ఇక అందులో భాగంగానే తను చివరి సినిమా చేసి సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇక మొత్తానికైతే తను ఇప్పుడు ఒక సాలిడ్ హిట్ కొట్టి సినిమాలకు గుడ్ బై చెప్పాలని చూస్తున్నాడు. ఇంకా ఈ సినిమాలోనే శ్రీలీలా ఐటెం సాంగ్ తో తమిళ్ తెలుగు ప్రేక్షకులను మెప్పించాలని చూస్తోంది. తను స్టార్ హీరోయిన్ అయి ఉండి కూడా డిఫరెంట్ పాత్రల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. ఇక ఈ సినిమాలో ఐటెం సాంగ్ చేయడం వల్ల శ్రీలీల కెరియర్ కి ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయా లేదంటే ఈ ఐటెం సాంగ్ చేయడం వల్ల ఇంకా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటుందా అనే విషయాలు తెలియాలంటే మనం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే.. ఇక మొత్తానికైతే శ్రీలీల వరుస సినిమాలను లైన్ లో పెడుతూ చాలా బిజీగా మారిపోయింది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com